అప్పులు ఇవ్వడమే
మన చేతుల్లో.. వసూలు కాదు..!



అప్పులు.. తిప్పలు



• పుణ్యానికి పోతే..!

అవసరాలే కాదు.. ఆడంబరాలు.. వ్యసనాలు కూడా అప్పులు చేయిస్తాయి. ఈ అప్పుల కోసం తెలిసిన.. తెలియని వారి చుట్టూ కాళ్లరిగేలా తిప్పిస్తాయి. చివరకు అప్పు పుట్టిన తర్వాత వారు చెప్పిన షరతులకు తలొగ్గుతారు. అవసరం తీరిన తర్వాత.. అప్పు చెల్లించేందుకు మొహం చాటేస్తున్న వారి సంఖ్య ఇటీవల సమాజంలో రోజురోజుకు పెరుగుతోంది. ఇది అప్పులు ఇచ్చేవారిపై ప్రభావం చూపుతోంది. అప్పులు.. తిప్పులు.. ముప్పులపై ఆంధ్రజ్యోతి ఆదివారం ప్రత్యేక కథనం.

డబ్బులిచ్చి.. ఆశలు వదులుకోవాల్సిందేనా ?



పాలకొల్లుకు చెందిన అనంతరావు హోటల్ నిర్వహిస్తాడు. తన హోటల్‌కు రోజూ టిఫిన్‌కు వచ్చి పద్ధతిగా కనిపించే గురుస్వామికి రూ.లక్షల రూపాయలు అప్పు ఇచ్చారు. ప్రతీ నెలా క్రమం తప్పకుండా ఒకటో తేదీనే వడ్డీ ఇస్తూ ఉండడంతో ప్రామిసరీ నోటు ఆధారంగా రూ.15 లక్షలు అప్పు ఇచ్చాడు. ఓ అర్ధరాత్రి బిచానా ఎత్తేశాడు. పదిహేనేళ్లపాటు ఇడ్లీలు, గారెలు అమ్ముకుని రూపాయి రూపాయి పోగేసి సంపాదించిన సొమ్ము ఇలా పోయిందేనని అనంతరావు ఆవేదన, ఆక్రోశం మాటల్లో వర్ణించలేం.

తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ప్రమీల. తన అపార్ట్‌మెంట్‌లో అద్దెకుంటున్న గురునాథానికి రెండు రూపాయల వడ్డీకి రూ.2 లక్షలు అప్పు ఇచ్చింది. బ్యాంకులో వుంటే తక్కువ వడ్డీ వస్తుందనే ఆశపడింది. ఐదారు నెలలు వడ్డీ సక్రమంగా చెల్లించినా గురునాథం చేస్తున్న వ్యాపారంలో నష్టం రావడంతో ఫ్లాట్ అద్దె కూడా కట్టలేని పరిస్థితుల్లో అర్ధరాతి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు. ఈ విషయం తెలిసిన ఆమె లబోదిబోమని గగ్గోలు పెట్టింది.



తణుకుకు చెందిన ఓ డాక్టర్. ఆయనకు తెలిసిన ఒకాయన ఫోన్ చేసి.. నాకు అర్జంట్‌గా ఓ పదివేలు ఇవ్వండి. పిల్లాడి ఫీజు కట్టాలి. లేకపోతే పరీక్ష రాయనివ్వరని మూడేళ్ల క్రితం అప్పు చేశాడు. ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఫోన్ చేసినా తీయడం లేదు. అప్పటి వరకు ఇద్దరూ తరచూ మాట్లాడుకునే వారు. అప్పు ఇచ్చి స్నేహం చెడగొట్టుకున్నానని ఆ వైద్యుడు వాపోతున్నారు. ఇక జీవితంలో ఎవరికీ అప్పు ఇవ్వకూడదని ఆయన నిర్ణయం తీసుకున్నాడు.

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్

వారిద్దరూ స్నేహితులు. వ్యాపార అవసరాల కోసం ఓ లక్ష సర్దు. నెల నెలా మూడు రూపాయల వడ్డీ చొప్పున ఇస్తానని చెప్పాడు. సరేనని మిత్రుడి కోసం అతను అప్పు చేసి ఇచ్చాడు. ఎనిమిది నెలలపాటు వడ్డీ సక్రమంగానే చెల్లించాడు. ఈలోగా అప్పు ఇచ్చిన వ్యక్తికి డబ్బులు అవసరం పడి మొత్తం సొమ్ము తిరిగి ఇవ్వమని అడగడంతో.. అప్పటి నుంచి వడ్డీ కూడా చెల్లించడం మానేశాడు. ఫోన్ చేసినా వ్యాపారంలో నష్టం వచ్చింది.. ఇప్పుడు లేవు. తర్వాత ఇస్తానని ఏడేళ్లుగా చెబుతూనే వున్నాడు. ఇవ్వనని చెప్పడు. అంటూ తన ఆవేదన చెప్పుకొచ్చారు.



6



రేపు సీఎం చంద్రబాబు పోలవరం రాక

పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్న కలెక్టర్, ఎస్పీ


దారుణం

» బాలికకు యువకుడి వేధింపులు.. ఆమె తండ్రి హెచ్చరించినా మారని తీరు
» ఊరు వదిలి మకాం మార్చినా వదల్లేదు.. కూతురినిచ్చి పెళ్లి చేయాలని బెదిరింపులు
» కుదరదన్నందుకు.. ఏలూరులో దారుణ హత్య

మరికొందరు ఉద్యోగులపై వేటు!

» ఉమ్మడి జిల్లాలో ఎంపీహెచ్‌ఏ (మేల్) నోటిఫైడ్ పోస్టులకు మించి నియామకాలు
» డీఎంహెచ్‌వో కార్యాలయంలో లంచావతారాల కనుసన్నల్లోనే అదనపు పోస్టులు ?
» అనర్హుల నియామకాలను వెలికితీయాలని ఆదేశాలు 7

నీటి సంఘాలన్నీ ఏకపక్షమే



కైకలూరు మండలం గోపవరంలో ఎన్నికైన నీటి సంఘం సభ్యులకు కూటమి నేతల సత్కారం

345 సంఘాలు ఏకగ్రీవం

» అన్నిచోట్ల కూటమి అనుకూలురుదే హవా
» ఎనిమిదేళ్ల తర్వాత ఎన్నికలతో రైతుల్లో ఉత్సాహం
» అడ్రస్ లేని వైసీసీ అనుకూలురు
» పట్టు బిగించిన కూటమి పార్టీలు



పెదపాడులో నీటి సంఘాల కార్యవర్గ సభ్యులకు ధ్రువీకరణ పత్రాల అందజేత

(ఏలూరు ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

జిల్లావ్యాప్తంగా సాగునీటి సంఘ ఎన్నికలు ప్రశాంతంగా ఏకగ్రీవంగా ముగిశాయి. ఎనిమిదేళ్ల తరువాత కూటమి ప్రభుత్వం రైతుల పక్షాన ఇచ్చిన హామీ మేరకు సాగునీటి ఎన్నికలను నిర్వహించింది. జిల్లావ్యాప్తంగా 356కు పైగా సాగు నీటి సంఘాలు ఉండగా వీటిలో రెండింటి ఎన్నికలను వాయిదా వేసి మిగతా 354 సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. 22 మండలాల్లో రైతులు, రైతు ప్రతినిధులు రైతు సంఘ ఎన్నికల్లో పాలు పంచుకున్నారు. ఈ ఎన్నికలకు కూటమి ప్రభుత్వం కారణంగానే ఇది సాధ్యమైందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్నిచోట్ల వైసీపీ అనుకూలురు ఈ ఎన్నికలకు దూరంగా మిగిలారు. జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఆట్టహాసంగా జరిగాయి. ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడినా కూటమి ప్రభుత్వం పట్టుదలతో ఈ ఎన్నికల నిర్వహణకు దిగింది. సాగునీటి సంఘాల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవడానికి వీలుగా శనివారం అన్నిచోట్ల రైతులు సమావేశమయ్యారు. ఆయా కాలువల పరిధిలో వున్న ఆయకట్టుదారులంతా ఒకేమాట.. ఒకే బాట రీతిలో ఎలాంటి వివాదలకు చోటు లేకుండా పరస్పర చర్చలతో ఏకాభిప్రాయానికి వచ్చారు. ఉదయం ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైన దగ్గర నుంచి ఎక్కడికక్కడ ఆయకట్టుదారులు ముందస్తు సమాచారంతో ఆయా ప్రాంతాలకు చేరుకున్నారు. ముందస్తుగానే నీటి సంఘాల సభ్యులుగా ఎవరు ఉండాలి, అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎవరు ఎన్నిక కావాలనే కోణంలోనే చర్చించుకున్నారు. తమ నియోజ కవర్గ శాసనసభ్యుడి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికలు సాఫీగా, ఏకగ్రీవంగా సాగేలా ఉమ్మడిగా ఒకమాట మీద ఉండండి. మీలో బాధ్యత కలిగిన వారిని ఎన్నుకోండి. భవిష్యత్తులో నీటి సమస్య లు తలెత్తకుండా కాస్త చొరవ ఉన్న వ్యక్తులను ఎన్నుకోండి.. అంటూ ఎమ్మెల్యేలు ఆయకట్టుదారులకు సూచనలు చేశారు. దీంతో సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల ప్రక్రియ దాదాపు మూడున్నర గంటల వ్యవధిలోనే జిల్లా అంతటా ఒక కొలిక్కి వచ్చింది.

ఎక్కడికక్కడ సంఘాల సభ్యుల ఏకగ్రీవ అమోదంతో 12 గంటల నాటికే జిల్లావ్యాప్తంగా వున్న 354 సంఘాల ఎన్నికలు ఆసాంతం ముగింపునకు వచ్చింది. ఆయా స్థానాలకు పోటీకి ఎవరు రాకపోవడంతో రంగంలో వున్నవారే ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే మంత్రి కొలుసు పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడు నియోజకవర్గంలో అన్ని నీటి సంఘాలకు ఏకగ్రీవంగా ఎన్నికలు ముగిశాయి. ఈ నియోజవర్గంలో కొంత మంది వైసీపీ నేతలు పోటీకి దిగవచ్చునని ప్రచారం సాగినా చివరకు వైసీపీ ఎక్కడా ఆదరికే రాలేదు. దీంతో ఎలాంటి వివాదాలు లేకుండానే సభ్యుల ఏకగ్రీవ అమోదంతోనే ఎన్నికలు ముగిశాయి.

చాట్రాయి మండలం బూరుగు గూడెం గ్రామ పరిధిలో మూడు సంఘాల ఎన్నికలు వాయిదా వేశారు. టీడీపీలోని రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగి నామినేషన్ పత్రాలు చింపివేయడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి.

దెందులూరు నియోజకవర్గంలోని అన్ని సాగు నీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అనుకూలురు గెలిచారు. సిట్టింగ్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలోనే అన్ని సంఘాలకు కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. పత్సమట్ల ధర్మరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉంగుటూరు నియోజకవర్గంలోనూ ఎన్నికలన్నీ ప్రశాంతంగా ముగిశాయి. వాస్తవానికి సాగునీటి సంఘాల ఎన్నికల్లోనూ కూటమి పక్షాల నడుమ ఎక్కడా వివాదాలు తలెత్తకుండా అధినాయకత్వం తగు సూచనలు చేశాయి. వీటికి అనుగుణంగానే జనసేన ఎమ్మెల్యేలు బాలరాజు, ధర్మరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న పోలవరం, ఉంగుటూరులోనూ కొన్ని సంఘాలను సర్దుబాటు చేసుకున్నారు. వాటి మధ్య పొరపచ్చాలు తలెత్తకుండా సాధ్యమైనంత మేర పరస్పర అంగీకారంతో నీటి సంఘాలు ఎన్నికలు జరిగినా జాగ్రత్తపడ్డారు.

ఏలూరు రూరల్‌లోనూ సాగునీటి ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా ఎమ్మెల్యే బడేటి చంటి తగు సూచనలు చేయడంతో ఎన్నికల ప్రక్రియ ఏకగ్రీవంగా ముగిసింది. చింతలపూడి పరిధిలోని నీటి సంఘాల్లోనూ ఎన్నికలన్నీ ఏకగ్రీవం అయ్యాయి. కైకలూరు నియోజకవర్గంలోనూ బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న అక్కడ కూడా వివాదాలకు తావులేకుండా ఏకగ్రీవంగా ముగిశాయి.

కూటమి పట్టు.. వైసీపీ బెట్టు

సాగు నీటి సంఘ ఎన్నికల్లో వైసీపీ అనుకూలురు పోటీ చేస్తారని తొలుత అందరూ ఊహించారు. ఏదో రకంగా వైసీపీ ప్రయత్నించకుండా ఉండదనే ప్రచారం సాగింది. బలం లేకున్నా కేవలం యాగీ కోసమే స్థానిక నేతలు కొందరిని ప్రోత్సహిస్తారని గొడవలకు తావు ఇవ్వవచ్చునని ఊహించారు. కానీ జిల్లా వ్యాప్తంగా ఎక్కడా వైసీపీ అనుకూలురు సాగు నీటి సంఘాల ఎన్నికల్లో జాడే కన్పించ లేదు. కొన్ని కీలక గ్రామాల్లో కూడా వైసీపీ కాస్తా కూస్తో పట్టువున్నా అక్కడ కూడా సైలెం ట్ అయ్యారు. ప్రత్యేకించి అధ్యక్ష పదవి కాక పోతే ఉపాధ్యక్ష పదవి అయినా కట్టబెట్టాలని వైసీపీ నుంచి డిమాండ్ ఉండవచ్చన్న ఊహా గానాలు తేలిపోయాయి. క్షేత్రస్థాయిలో ప్రత్యేకించి రైతుల్లో ఏ మాత్రం పట్టు సడలకుండా కూటమి ప్రభుత్వం ప్రయత్నించి సాగునీటి సంఘాల ఎన్నికల్లో సక్సెస్ అయింది. వైసీపీ జాడ లేకుండా చేసింది. నీటి సంఘాల్లో ఆయకట్టుదారుల ప్రాతినిధ్యం ఉండటంతో భవిష్యత్తులో జరగబోయే స్థానికసంస్థల ఎన్నికలకు ఇవి పునాది వంటివే అని భావిస్తున్నారు.

పంచాయతీల్లో పన్నుల వసూళ్లు

23.38%

» వసూలు చేయాల్సిన ఇంటి పన్నులు రూ.19.31 కోట్లు
» వసూలైంది రూ.4.51 కోట్లు



ఏలూరు సిటీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీనిపై పంచాయతీరాజ్ అధికారులు దృష్టి సారించారు. వసూళ్లను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సమీక్ష సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేస్తున్నారు. జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డివిజన్లకు 27 మండలాలు.. 547 గ్రామ పంచాయతీలున్నాయి. 2023-24 సంవత్సరానికి వసూలు చేయాల్సిన పన్నుల డిమాండ్ రూ.19.31 కోట్లు. వసూలైంది కేవలం రూ.4.51 కోట్లు. ఇతర పన్నులు రూ.16.55 కోట్లకు వచ్చింది రూ.4.81 కోట్లు. ఈ నెల నుంచి పన్నుల వసూలు వేగం పుంజుకుంటుందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు 2024-25 డిమాండ్ కూడా వచ్చేసింది. వీటిని గృహ యజమానులకు అందజేస్తున్నారు. ఇంటి పన్నులు, ఇతర పన్నుల డిమాండ్‌కు అనుగుణంగా గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్ళు త్వరితగతిన పూర్తిచేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధ తెలిపారు.

అత్యధికంగా వసూలు

డివిజన్ల వారీగా..

- నూజివీడు డివిజన్‌లో ఆరు మండలాల్లో 129 గ్రామ పంచాయతీలున్నాయి. ఇక్కడ ఇంటి పన్నుల డిమాండ్ రూ.5.50 కోట్లు కాగా, వసూలైంది రూ.1.40 కోట్లు. ఇక ఇతర పన్నుల విషయానికి వస్తే డిమాండ్ రూ.3.59 కోట్లు కాగా వసూలైంది రూ.42.20 లక్షలు.
- జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 10 మండలాల్లోని 167 గ్రామ పంచాయతీలకు ఇంటి పన్నుల డిమాండ్ రూ.6.90 కోట్లు. వసూలైంది రూ.1.03 కోట్లు. ఇతర పన్నుల డిమాండ్ రూ.6.14 కోట్లు కాగా వసూలైంది రూ.75.07 లక్షలు.
- ఏలూరు డివిజన్‌లో 11 మండలాల్లో 251 గ్రామ పంచాయతీలకు ఇంటి పన్నుల డిమాండ్ రూ.6.90 కోట్లు కాగా, వసూలైంది రూ.2.08 కోట్లు. ఇతర పన్నుల డిమాండ్ రూ.6.82 కోట్లు కాగా వసూలైంది రూ.3.63 కోట్లు. ఏలూరు డివిజన్‌లోనే అత్యధిక పన్నులు వసూలైంది.

- ఇంటి పన్నులు అత్యధికంగా వసూలైన మండలాల్లో వరుసగా వేలేరుపాడు మండలంలో 73.34 శాతం, నూజివీడు 69.22, ఉంగుటూరు 62.82, నిడమర్రు 61.29, ఏలూరు 53.28 శాతం వసూలయ్యాయి. ఇతర పన్నుల విషయానికొస్తే మండవల్లిలో 51.90, వేలేరుపాడు 99.0, కుక్కునూరు 78.53, ఏలూరు 65.90, ఆగిరిపల్లి మండలంలో 62.94 శాతం పన్నులు వసూలయ్యాయి.

అలరించిన నృత్య పోటీలు



సాత్వికం



భయానకం

ఏలూరు రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అభినయ నృత్యభారతి 29వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి కూచిపూడి జానపద బృంద నృత్య పోటీలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. 150 మందికిపైగా కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. పెండ్యాల లక్ష్మీప్రియ కూచిపూడి, పి.సుమంత్ పేరిణి శివతాండవం, శ్వేత ప్రసన్న కూచిపూడి, తనూజ కుమార్‌పాండా ఒడిస్సీ, వన్నాల కస్తూరి పేరిణి నృత్యం, పి.పద్మిని ఆంధ్రనాట్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాట్యంలో విశేష సేవలు అందించిన వారికి నృత్య తపస్వి, సేవా తపస్వి, నృత్య కౌముది అవార్డులను ప్రదానం చేశారు. నాట్యాచార్య దువ్వి హేమసుందర్ పర్యవేక్షించారు.



రౌద్రం



శాంతం

ఫార్మాసిస్టు మెరిట్ జాబితాలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ జోన్-2(ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలు) పరిధిలో కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయతలపెట్టిన గ్రేడ్-2 ఫార్మాసిస్టు పోస్టుల దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ లిస్టును ఆయా జిల్లాల వెబ్‌సైట్లలో శనివారం పొందుపర్చినట్లు ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 16 నుంచి 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా రాజమహేంద్రవరం ఆర్‌డీ కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేయాలని సూచించారు.



ఆర్చరీ పోటీల్లో విల్లు ఎక్కు పెట్టిన క్రీడాకారులు

• మా గురి తప్పదు

భీమవరం అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ ఆర్చరీ పోటీలు శనివారం భీమవరం వంశీ కృష్ణ నగర్‌లోని జిల్లా అర్చరీ అకాడమీలో నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరికి చెందిన ఆర్చరీ క్రీడాకారులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో ఎం.సూర్యహంసిని ప్రథమ, కె.శరణ్య ద్వితీయ, కె.సుస్మిత తృతీయ స్థానాల్లో నిలిచారు. బాలుర విభాగంలో ఎం.సుషాస్ ప్రథమం, సీహెచ్ హరీష్ నాయుడు ద్వితీయస్థానాల్లో నిలిచారని అర్చరీ జిల్లా అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎల్.జయరాజు తెలిపారు. విజేతలు ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కోచ్ ఈ.సాహిత్ తదితరులు పాల్గొన్నారు.



చెస్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

• ఎత్తుకు పైఎత్తులు వేద్దాం

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): చిట్టూరి గణేశ్వరరావు టౌన్ హాలులో ఈ నెల 24, 25 తేదీల్లో మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జరగబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ స్థానిక ప్రియదర్శిని కళాశాలలో శనివారం జరిగింది. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ అలుగు ఆనందశేఖర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో రెండు వందల మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ చెస్ అకాడమీ కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ, సిటీ కేబుల్ ఎండీ సీహెచ్ హరికృష్ణ, పాతూరి అంబేద్కర్, ఎస్.రాధాకృష్ణ, టౌన్ హాలు అధ్యక్షుడు ఎస్.బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్పు...తప్పు!



సండే స్పెషల్

- అప్పుల ఊబిలో సామాన్యులు
- వసూళ్లు లేవంటున్న మాన్యులు
- పలువురి అవసరాల కోసం.. మరికొందరు అప్పుచేసి ఆర్భాటాలు

• భీమవరానికి చెందిన కృష్ణప్ప తన అవసరాల నిమిత్తం రూ.20 లక్షలు అప్పు తెచ్చాడు. అప్పు తీర్చాలనే సంకల్పం ఉన్నా చేస్తున్న వ్యాపారాలు కలిసి రాక సకాలంలో వడ్డీలు కట్టలేని పరిస్థితి. చావా రేవా అనే పరిస్థితుల్లో అప్పు తీసుకునే వ్యక్తి ఉండగా అప్పు ఇస్తున్న ఆసామీలు తమ బాకీ వసూళ్లకు ఇబ్బందులు పడుతున్నారు.

• పాలకొల్లుకు చెందిన కృష్ణారావు (పేరు మార్చబడింది) తన కుమార్తె వివాహం నిమిత్తం రూ.25 వేలు రుణం తీసుకున్నాడు. ఆపై రుణం ఇచ్చిన వ్యక్తి ఎన్ని పర్యాయలు అడిగినా తీర్చలేకపోయాడు. వారం కిందట రుణం ఇచ్చిన వ్యక్తి కృష్ణారావు ఇంటికి వెళ్లి గట్టిగా నిలదీయగా 'నా చావుకు నీవే కారణమని లెటర్ రాసి ఆత్మహత్య చేసుకుంటా' అంటూ బెదిరించడంతో రుణం ఇచ్చిన ఏం చేయాలో తెలియక వెనుదిరిగాడు.

పాలకొల్లు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అప్పు.. అనే పదం ఇప్పుడు అందరి నోటా విన్పించే వాడుక పదంగా మారింది.. అప్పు ఇవ్వడం తప్పా.. తీసుకోవడం తప్పా అంటే.. ఆర్థిక నిపుణులు రెండు తప్పే అంటున్నారు. ప్రస్తుత రోజుల్లో అప్పులు తీసుకునేవారి సంఖ్య తోపాటు ఇచ్చేవారి సంఖ్య పెరిగింది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాల్లో అప్పులు లేనిదే గడవడం లేదు. ఉమ్మడి జిల్లాలో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోతుండగా మరోవైపు అప్పులు ఇచ్చిన మాన్యులు వసూలు కాక ఇబ్బందులు పడుతున్న పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

నేటి రోజుల్లో ప్రతీ చిన్న అవసరానికి అప్పు లేనిదే రోజు గడవని పరిస్థితి ఏర్పడింది. నిత్యావసరాలు మొదలుకొని గృహోపకరణాలు, ఆభరణాలు సైతం ఈఎంఐల పద్ధతి లో లభింస్తుండం, ఇవి కాకుండా ప్రైవేటు వ్యక్తు లు అప్పులు ఇస్తుండడం తీసుకునేవారికి ఒక రకంగా శాపంగానే మారింది. ముఖ్యంగా పిల్లల ఉన్నత విద్యకు, అవసరాలు, నిర్మాణాలు వంటి వాటికి అరకొర మేరకు అప్పు చేస్తే పర్వాలేదు. అయితే నేడు అనేక కుటుంబాల్లో ఆర్భాటాలకు పోతూ అప్పులు చేస్తున్నారు. అప్పు తీర్చే విధానం ఏ విధంగా ఉంది.. ఆదాయం ఎంత వస్తుంది.. ఇంటి అవసరాలకు పోను అప్పు తీర్చడానికి సొమ్ములు మిగులుతాయా.. అనే అంశాలను పరిగణలోకి తీసుకోకుండానే అప్పులు చేసి ఇబ్బం దులు పడుతున్నారు. పేదరికంలో అవసరానికి అప్పు చేసే వ్యక్తులు ఒక కోవకు చెందిన వారు అయితే ఆర్భాటాలకు అవసరం లేని ఖర్చులకు అప్పులు చేసే వారు మరో కోవకు చెందినవా రు. ఇప్పుడు జిల్లాలో 50 శాతం పైబడి పౌరులు వివిధ రూపాల్లో రుణగ్రహీతలుగానే ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

అప్పు కోసం తిప్పలు

ఏదైనా అవసరం పడి మిత్రులను బంధువులను అప్పు అడిగితే ఒకటి లేదా రెండు సార్లు అడిగిన వెంటనే అప్పులు తీసుకునే పరిస్థితి ఉంది. అయితే అప్పు తీసుకున్న ఆసామీలు తగిన సమయానికి ఇవ్వకపోవడంతో అప్పు తీర్చమని వందల సార్లు వేడుకోవాల్సి వస్తుందని అప్పు ఇస్తున్న వ్యక్తులు వాపోతున్నారు. అప్పు తీసుకున్నవారు పెద్ద సంఖ్యలో ఉండగా అప్పు ఇస్తున్న వారూ అధికంగానే ఉన్నారు. ఒక అంచనా ప్రకారం జిల్లాలో రూ. 10 వేల కోట్ల రూపాయల పైబడి ప్రైవేటు రుణాలు వివిధ రూపాల్లో సామాన్య, మధ్యతరగతి ప్రజల వద్ద ఉన్నాయి. ఇవన్నీ ఒప్పందం ప్రకారం తీరుతాయా అంటే అనుమానమే. ఎందుకంటే ప్రస్తుతం తీవ్ర ఆర్థికమాంద్యం తాండవిస్తోంది. విపణిలో వ్యాపారాలు లేవు. సామాన్యుల చేతిలో నగదు లేదు. ఈ పరిస్థితుల్లో అప్పు పుట్టలన్నా లేదా ఇచ్చిన అప్పు వసూలు కావాలన్నా తిప్పలు తప్పడం లేదు.

ఆస్తి రాసి ఇస్తేనే..

ప్రామిసరీనోటు చేతి అప్పులు మాట అలా ఉంచితే మార్కెట్‌లో కొత్త తరహా అప్పు విధానం నడుస్తోంది. ఒక వ్యక్తికి రూ.పది లక్షలు అప్పు కావాలంటే అతడికి ఉన్న ఇంటినో స్థలాన్నో లేదా పొలాన్నో అప్పు ఇచ్చేవ్యక్తి కొనుగోలు చేసుకున్నట్టు రాయించుకుని అప్పు ఇస్తున్నారు. అప్పు తీసుకున్న వ్యక్తులు సకాలంలో చెల్లించలేకపోతే ఆస్తి మొత్తం అప్పు ఇచ్చిన వ్యక్తి స్వాధీనం చేసుకునే పరిస్థితి. అయితే అప్పు తీప్పు తీసుకున్న వ్యక్తి అప్పు తీరుస్తామని వెళ్లినా ఆస్తి రాయించుకుని అప్పు ఇచ్చిన వ్యక్తులు అడ్డం తిరుగుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి.

ఆర్భాటాలకు అప్పులు వద్దు..

అప్పులు కోసం అర్రులు చాయడం, ఏమంత క్షేమకరం కాదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఆయా కుటుంబాలు తమ ఆదాయాన్ని ఖర్చులను మదింపు చేసుకుని అవసరం మేరకే ఖర్చులు చేయాలని సూచిస్తున్నారు. ఆర్భాటాల కోసం అప్పులు చేస్తే చివరకు ప్రాణాంతకంగా మారుతుందని అప్పు తీర్చాలనే సదుద్దేశ్యం ఉన్నప్పటికి చేతిలో చిల్లి గవ్వ లేని పరిస్థితుల్లో ఆయా వ్యక్తులు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యల వైపు వెళుతున్నారని మానసిక వైద్యులు చెబుతున్నారు. పక్కవాళ్లను చూసి స్థోమత లేకున్నా అప్పులు చేసి పిల్లలకు కార్పొరేట్ విద్య, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం, ఇళ్లు, ఇళ్ల స్థలాల కొనుగోలు, పెండ్లి వేడుకలు వంటి వాటి వల్ల అప్పుల తిప్పలే మిగులుతాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. తమ చేతిలో 85 శాతంపైగా పెట్టుబడి పెట్టగలిగినప్పుడే సొంతింటికి కొనుగోలుకు వెళ్ళాలని అప్పులు చేసి ఇల్లు కొనుగోలు చేస్తే చివరకు అమ్ముకునే పరిస్థితి వస్తుందని సూచిస్తున్నారు. మరోవైపు అప్పు ఇచ్చేవాళ్లు కూడా తమకు అప్పు తిప్పలు తప్పాలంటే అప్పు తీసుకుంటున్న వ్యక్తి గురించి పూర్తిగా తెలుసుకోవాలని, అప్పు తీర్చగలిగే శక్తి ఉందా లేదని గమనించాలని ఆర్థిక రంగనిపుణులు సూచిస్తున్నారు.



చినవెంకన్న ఆలయం

శ్రీమహా విష్ణువుకు ప్రీతికరం..

దివ్య ధనుర్మాసం

రేపటి నుంచి ప్రారంభం.. జిల్లాలో ముస్తాబవుతున్న వైష్ణవ ఆలయాలు

ద్వారకాతిరుమల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీమహావిష్ణువుకు ఎంతో ప్రీతికరమైనది ధనుర్మాసం. సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఈ మాసం తెలుగు సంస్కృతిలో ఒక భాగం. దక్షిణాయనానికి చివర, ఉత్తరాయనానికి ముందుండే ధనుర్మాసంలో ప్రాతఃకాలం ఎంతో పవిత్ర మైనది. దేవాలయాల్లో జరిగే ఆగమ శాస్త్ర కైంకర్యాలలో స్థానిక ఆచార వ్యవహారాలు, ఇతర సంప్రదాయాలు కలసిన అంశాల్లో ధనుర్మాసం ఒకటి. నిజానికి ఆండాళ్ పూజ, తిరుప్పావై పఠనం, గోదా కల్యాణం, వంటివి ద్రావిడ దేశ సంప్రదాయమని పండితుల అభిప్రాయం.

ధనుస్సంక్రమణ ఎప్పుడు..

చాంద్రమాన శ్రీక్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం, హేమంత రుతువు, మార్గ శిరం, కృష్ణపక్షం ధనుస్సంక్రమణ 16 డిసెం బరు, 2024 సోమవారం ఉదయం 6-57ని. కు ప్రవేశి స్తుంది. సూర్యుడు వృశ్చిక రాశి నుంచి ధను రాశిలోకి ప్రవేశిస్తాడు. పుష్య మాసంలో 14 జనవరి 2025, మంగళవారం మ.02.45ని. లకు సూర్యుడు ధనురాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. దీనినే మకర సంక్రమణ అంటారు.



శ్రీవారు, అమ్మవార్ల మూలవరులు

ప్రతీ రోజూ శ్రీ వారి గ్రామోత్సవం

ఈ ధనుర్మాసంలో ప్రతీరోజూ ద్వారకాతిరుమల క్షేత్రంలో ఉభయదేవేరులు, గోదాదేవితో కలసి శ్రీవారు క్షేత్రపురవీధుల్లో ఊరేగుతారు. గ్రామోత్సవం అనంతరం ధనుర్మాస (విలాస) మండపంలో కొలువుతీరి పూజలందుకుంటారు. ఆ తర్వాత భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరుగుతుంది. ఈ ధనుర్మాసంలో జనవరి 10న వచ్చే వైకుంఠ ఏకాదశి సందర్భంగా దీక్షాధారణ చేపట్టిన గోవిందస్వాములు ప్రతీరోజూ శ్రీవారి తొలి దర్శనం చేసుకుంటారు. ఆధ్యాత్మిక మాసంగా చెప్పే ధనుర్మాసంలో భక్తులకు రోజూ పండుగే.

సుప్రభాతానికి మారుగా తిరుప్పావై

సూర్యుడు ధనస్సు నుంచి మకర రాశిలోకి ప్రవే శించే వరకు అంటే భోగి పండుగ రోజు వరకూ ధనుర్మాసం కొనసాగుతుంది. ఈ నెలరోజులు వైష్ణవ ఆలయాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాతా నికి మారుగా తిరుప్పావైను పఠిస్తారు. ఈ మాసంలో ఉభయసంధ్యలలో ఇంటిని శుభ్రం చేసి దీపారాధన చేయడం వల్ల అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని పండితులు చెబుతున్నారు.

వేదాలు, ఉపనిషత్తుల సారమే తిరుప్పావై

ధనుర్మాసం నెలరోజులూ బ్రహ్మ ముహూర్తంలో తిరుప్పావైను పారాయణ చేస్తే కోర్కెలు సిద్ధిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆండాళ్ రచించిన దివ్యప్రబంధమే తిరుప్పావై. ద్రవిడ భాషలో తిరు అంటే పవిత్రం అని, పావై అంటే వ్రతం అని అర్థం. పురాణాల ప్రకారం విష్ణుచిత్తుని కుమార్తె గోదాదేవి శ్రీరంగనాథుడిని వివాహం చేసుకుంటానని దీక్ష పూనుతుంది. తన అనుభూతిని, భావాలను ఒక పద్యం అంటే పాశురం రూపంలో రచించి 30 పాశురాలను విష్ణువుకు అంకితం చేస్తుంది. ఆమె భక్తికి ముగ్ధుడైన శ్రీరంగనాథుడు, గోదాదేవిని పరిణయమాడు తారు. ఈ గోదాకల్యాణం శ్రీవారి క్షేత్రంలో భోగి రోజున స్వామి, అమ్మవార్ల కల్యాణంతో కలసి నిర్వహిస్తారు.

ధనుర్మాసంలో గొబ్బెమ్మలు ఎందుకు..

ఈ పర్వదినాల్లో ప్రతీరోజూ తమ ఇంటి ముందు గొబ్బెమ్మలు ఉంచి వాటిని బియ్యంపిండి, పసుపు, కుంకుమ, పూలతో పూజి స్తారు. లక్ష్మీదేవి రూపంలో ఉన్న గొబ్బెమ్మలను పూజిస్తే మంచి జరుగుతుందని పండితుల ఉవాచ.



ముస్తాబవుతున్న ధనుర్మాస మండపం



హైకోర్టు న్యాయమూర్తి మల్లికార్జునరావుకు స్వామివారి మెమెంటో అందిస్తున్న ఈవో మూర్తి

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ద్వారకాతిరుమల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి):ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు శనివారం సందర్శించుకున్నారు. ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు అర్చకులు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. ఈవో సత్యనారాయణమూర్తి ఆయనకు స్వామి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.



ద్వారకాతిరుమల ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి

చినవెంకన్నకు పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గోవింద నామ స్మరణలతో చినవెంకన్న క్షేత్రం మారుమోగింది. మార్గశిరమాస పర్వదినాలు, శ్రీవారికి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో ఆలయం భక్తులతో పోటెత్తింది. దాదాపు 20వేల మంది శ్రీవారు, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఉత్తరం రాస్తే బహుమతి!

చేతిరాత మెరుగుదలకు ఢాయి అఖర్ పేరుతో తపాలా శాఖ పోటీలు



నిడమర్రు డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి) : పూర్వం రోజులలో 'పోస్ట్' అంటూ పిలుపు వినబడితే చాలు ఆ రోజు ఇంట్లో సందడే సందడి. చిన్నా పెద్దా అంతా ఆ ఉత్తరం చదవాలనే ఆసక్తితో పాటు ఎవరు రాశారు, ఏమి రాశారు, ఎక్కడి నుంచి వచ్చిందన్న కుతూహలం చూపేవారు. ఆ రోజుల్లో ఎటువంటి సమాచారం తెలియాలన్నా అన్నింటికీ ఉత్తరమే ఆధారంగా నిలిచేది. ఒకప్పుడు సమాచార వ్యవస్థలో ఉత్తరమే రారాజుగా వెలుగొందేది. కానీ నేడు సాంకేతిక వ్యవస్థలో వచ్చిన ఆధునిక మార్పుల ఫలితంగా ఉత్తరం నానాటికీ బక్కచిక్కిపోతోంది. సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్, కంప్యూటర్ల పుణ్యమా అని సమాచార రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకొన్నాయి. స్మార్ట్ ఫోను పుణ్యంతో ఉత్తరం రాసేవారు, చదివేవారు కరువైపోయారు.


ఉత్తరం ప్రాధాన్యతను తెలిపేందుకు..

ఉత్తరం ప్రాధాన్యతను నేటి తరానికి తెలియజేయడం కోసం భారత తపాలా సంస్థ చర్యలు చేపట్టింది. చేతిరాతను మెరుగుపరిచేందుకు, లేఖారచన అలవాటును పెంచడం కోసం పోటీలు నిర్వహిస్తోంది. ఒకప్పుడు ఉత్తరాల ద్వారా సమాచారం పంపే పద్ధతిని తపాలాశాఖ మళ్లీ తెరపైకి తెచ్చింది. వ్యాసాన్ని చేతిరాతతో తమకు పంపాలని 'ఢాయి అఖర్' పేరుతో రాష్ట్ర, జాతీయస్థాయిలో పోటీలను నిర్వహిస్తోంది.

పోటీలు.. బహుమతులు

ఈ పోటీలను తపాలా శాఖ రెండు విభాగాలలో నిర్వహిస్తోంది. 18 ఏళ్ల లోపు విద్యార్థులకు, 18 ఏళ్లు దాటిన విద్యార్థులకు వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తోంది. పోటీలు నిర్వహించే అంశం 'ది జాయ్ ఆఫ్ రైటింగ్ ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిట్ ఏజ్' అంశంపై లేఖ రాయాలి. ఇంగ్లీషు, హిందీ, తెలుగు , ఉర్దూ సహా ఏ భారతీయ భాషలలోనైనా లేఖ రాయవచ్చు. ఎన్వాలప్ కవర్‌లో రాసేవాళ్లు 1000 పదాలతో కూడిన లెటర్ 'ఏ4' పేపరు మీద రాసి, దానికి పాఠశాల వివరాలు, జనన ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఇన్‌లాండ్ లెటర్ మీద రాసేవాళ్ళు 500 పదాలతో లెటర్ రాసి పంపాలి. లెటర్ పై 'ఢాయి అఖర్' అనే పేరు రాసి స్థానిక హెడ్ పోస్టాఫీసుకు స్వయంగా లేదా పోస్టు ద్వారా డిసెంబరు 31 లోపు పంపాలి. ఉత్తరాలలో ప్రతిభ చూపిన వారికి రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు నగదు పురస్కారం అందజేస్తారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమస్థానం విజేతకు రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు అందజేస్తారని తపాలా శాఖాధికారులు తెలిపారు.

సృజనాత్మకత పెంపొందుతుంది



విద్యార్థుల్లో రాత సామర్థ్యం పెంచడం కోసం తపాలా శాఖ జాతీయస్థాయిలో పోటీలు నిర్వహిస్తోంది. ఉత్తరం ద్వారా లేఖారచన చేయడం ద్వారా విద్యార్థులు, యువతతో లేఖన సామర్థ్యం, సృజనాత్మకత పెంపొందుతుంది. భాషా జ్ఞానం పెరుగుతుంది. ఆసక్తి గల యువతీ యువకులు, విద్యార్థులు తమ చేతి సామర్థ్యం నిరూపించు కోవడం కోసం ఈ పోటీలు చక్కని వేదికగా నిలుస్తాయి.

కె.కృష్ణ, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, తాడేపల్లిగూడెం

సిరుల పంట కోకో



- సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు
- జిల్లాలో పెరిగిన సాగు విస్తీర్ణం

దెందులూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కోకో పంట సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. కోకో గింజలకు అంతర్జాతీయ డిమాండ్ ఉంది. దేశంలో అత్యంత ఎక్కువ కోకో పంటను ఏలూరు జిల్లాలోనే అత్యధికంగా సాగు చేస్తున్నారు.సంవత్సరానికి ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.30 వేలు పెట్టుబడి పెడితే దాదాపు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వస్తుండడంతో రైతులు కోకో సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

జిల్లాలో 35 వేల 800 ఎకరాల్లో పంటను వేశారు. ఏటా 12 వేల టన్నుల వరకు కోకో పంట దిగుబడి వస్తుంది. ప్రస్తుతం కాస్తా ధర తగ్గినా జనవరిలో ధర పెరిగే అవకాశం ఉంది. జిల్లాకు విదేశీ పంటగా 31 ఏళ్ల క్రితం పరిచయమైన కోకో పంట దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగి, దెందులూరు, ద్వారకా తిరుమల, నూజివీడు, ముసునూరు, భీమడోలు తదితర మండలాల్లో ప్రధాన వాణిజ్య పంటగా విస్తరించింది. పామాయిల్, కొబ్బరి, అరటి తోటల్లో అంతర పంటగా రైతులు సాగు చేస్తున్నారు. ప్రారంభంలో కోకో గింజల ధర కేజీ రూ.80 ఉండేది. ఆపై రూ.250 వరకు పెరిగింది. అయితే 2023లో ఒకేసారిగా కేజీ రూ.1060 పలకడంతో రైతులు దృష్టి పూర్తిస్థాయిలో కోకో పంట సాగుపై మరలింది. దేశ వ్యాప్తంగా కోకో పంటకు లక్ష టన్నులకు డిమాండ్ ఉండగా మన జిల్లాలోనే 12 నుంచి 13 వేల టన్నుల వరకు ఉత్పత్తి అవుతుండగా మిగిలిన దానిని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.


కోకో హబ్‌గా ఏలూరు జిల్లా

కోకో పంట గింజలను చాక్లెట్ తయారీ, కాస్మొటిక్ తయారీలో ఎక్కువగా వినియోగించడంతో మన ఏలూరు జిల్లా కోకో హబ్‌గా మారింది, 90 శాతం చాక్లెట్స్ తయారీ, 30 శాతం కాస్మోటిక్ క్రీమ్‌ల తయారీలో కోకోను ప్రస్తుతం వినియోగిస్తున్నారు. సౌత్ అమెరికా, అమెజాన్ వంటి అటవీ ప్రాంతాల్లో ప్రారంభమైన కోకో పంట ప్రస్థానం ప్రస్తుతం జిల్లాలో ఒక వెలుగు వెలుగుతోంది. వాణిజ్య పంటల్లో పామాయిల్, కోకో పంటలదే అగ్రస్థానం. గోదావరి, కృష్ణా డెల్టాల మధ్య ప్రాంతం కావడం, వాతావరణంలో తేమ శాతం ఉండడం, పోషకాలతో ఉన్న ఎర్రరేగడి నేలలు కావడం జిల్లా వాతావరణం కోకో పంటలకు నూరుశాతం అనుకూలంగా ఉండడంతో విస్తీర్ణం పెరుగుతోంది. పామాయిల్ తోటలో కోకో పంట పండిస్తే 2 క్వింటాలు దిగుబడి వస్తుండగా పూర్తిగా కోకో సాగుచేస్తే ఐదు నుంచి ఆరు క్వింటాల వరకు దిగుబడి వస్తోంది. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉండడంతో కోకో పంటను రైతు అమ్మిన 24 గంటల్లోనే నగదు చెల్లింపులు జరుగుతున్నాయి. ప్రధానంగా జిల్లాలో హిందుస్థాన్, క్యాడ్‌బరీస్, రమ్య ఫ్రూట్స్ కంపెనీ, చిన్నపాటి చాక్లెట్ కంపెనీలు ఏజెంట్‌ల ద్వారా కొనుగోలు చేస్తున్నాయి. కోకో కాయలను చెట్టు నుంచి కోసిన తర్వాత కాయలను కోసి లోపల ఉన్న కోకో గింజలను తీసి నాలుగు నుంచి ఆరురోజుల పాటు అరబెట్టి రైతులు కంపెనీలకు విక్రయిస్తున్నారు.



ఆరబెట్టిన కోకో గింజలు

రూ.1,000 తగ్గకుండా చూడాలి



నాణ్యమైన కోకో పంటను పండిస్తున్నా కొంతమంది కమీషన్ ఏజెంట్‌లు కేవలం కేజీకి రూ.800 ఇస్తూ కృత్రిమంగా ధర తగ్గిస్తున్నారు. ధరలపై ప్రభుత్వ పర్యవేక్షణ చేయాలి. కేజీ రూ.వెయ్యి తగ్గకుండా చూడాలి.

పాలడుగు నరసింహరావు, కోకో రైతు, కొండలరావుపాలెం

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



కోకో గింజలకు మార్కెట్‌లో మంచిధర ఉన్నప్పటికి కొన్ని కంపెనీలు చదువు లేని రైతులను మోసం చేస్తూ ధర తగ్గిందని నమ్మిస్తూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కోకో పంట వల్ల వచ్చిన లాభాన్ని కమీషన్ ఏజెంట్‌లు దొంగిలించకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

యలమర్తి శ్రీనుబాబు, సానిగూడెం



తాడేపల్లిగూడెంలో వస్త్ర దుకాణం ప్రారంభిస్తున్న రామానుజ జియర్ స్వామి

కాంచీపురం వరమహాలక్ష్మి షోరూం ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని కేఎన్ రోడ్డులో శనివారం సాయి సిల్క్స్ (కళామందిర్) తమ 64వ షోరూంగా కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్‌ను ఆధ్యాత్మిక ధర్మ ప్రచారకర్త త్రిదండి అహోబిల రామానుజ జియర్ స్వామి సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్‌తోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వరమహాలక్ష్మి సిల్క్స్ వద్ద రామానుజ జియర్‌స్వామి అందించే ప్రసాదం కోసం భక్తులు ఎగబడ్డారు. అనంతరం స్వామి మాట్లాడుతూ వస్త్రం మన గౌరవాన్ని పెంచేలా ఉండాలన్నారు. కానీ నేడు వస్త్రం ఎంత చిరిగి ఉంటే అంత ధర ఎక్కువ పలుకుతుందన్నారు. కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ డైరెక్టర్ అన్నం రాజేష్ మాట్లాడుతూ తమ సంస్థ స్వచ్ఛమైన పట్టు చీరలు, హ్యాండ్‌లూమ్ చీరలు, బెనారస్, పటోలా, కోట, పైతాని, కుప్పడం, ప్రీమియం, ఎత్నిక్ అన్నిరకాల చీరలు అత్యంత తక్కువ ధరకు అందిస్తామన్నారు. షోరూంలో కంచికామాక్షి అమ్మవారి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి పురుషోత్తమ కుమార్

కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్ చక్కని వేదిక : జిల్లా జడ్జి

ఏలూరు క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ తగాదా కేసులు పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్ చక్కని వేదిక అని ఇరుపక్షాలకు స్నేహపూర్వక వాతావరణంలో కేసుల పరిష్కారం జరుగుతాయని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా జడ్జి పురుషోత్తమకుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం కోసం ముందస్తుగా నిర్వహించిన మధ్యవర్తిత్వం చక్కటి ఫలితాలు ఇచ్చిందని, ఎక్కువ కేసులు పరిష్కరించడానికి ఉపయోగపడిందన్నారు. భవిష్యత్‌లో కూడా ఇదే విధానాన్ని కొనసాగించాలని సూచించారు. లోక్ అదాలత్‌కు ప్రత్యక్షంగా హాజరు కాలేని కక్షిదారులు ఆన్‌లైన్ ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా జడ్జి పి మంగాకుమారి, రెండవ అదనపు జిల్లా జడ్జి సునిల్‌కుమార్, పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి ఎస్ ఉమాసునంద, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, అదనపు సివిల్ జడ్జి కేకేవీ బులి కృష్ణ, ఏలూరు బార్ అధ్యక్షులు కోనే సీతారామ్, ప్రభుత్వ న్యావాది బీజే రెడ్డి, లోక్‌అదాలత్ సభ్యులు అబ్బినేని విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

4985 కేసుల రాజీ

ఏలూరు క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో శనివారం అన్ని కోర్టులలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 4985 కేసులను రాజీ చేశారు. వీటిలో 323 సివిల్ కేసులు, 4662 క్రిమినల్ కేసులు, 71 లిటిగేషన్ కేసులను రాజీ చేసినట్లుగా తెలియజేశారు.



పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో సమీక్షా సమావేశంలో కలెక్టర్, ఎస్పీ

ముఖ్యమంత్రి పోలవరం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

పోలవరం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టు పర్యటనలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, ఏఎస్పి ఎన్.సూర్య చంద్రరావు, ఏఆర్ డీఎస్పీ పి.చంద్రశేఖర్, పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను ఆమె పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం ఉదయం 10.45 గంటలకు ముఖ్యమంత్రి హెలీకాప్టర్‌పై పోలవరం ప్రాజెక్టుకి చేరుకుంటారని తొలుత డయాఫ్రంవాల్, కాఫర్‌డ్యాం, ప్రాజెక్టు ప్రాంతాలను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు రానీయకుండా జాగ్రత్తలు వహించాలని అధికారులకు సూచించారు. హెలీప్యాడ్ వద్ద కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రాజెక్టులో డయాఫ్రంవాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు గ్యాప్ 1,2,3 ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎంవీ రమణ, పోలవరం సీఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ పవన్ కుమార్, తహసీల్దారు బి.సాయిరాజు తదితరులు పాల్గొన్నారు.



యాత్రకు బయలుదేరిన యూత్‌హాస్టల్స్ ప్రతినిధులు

యూత్‌హాస్టల్స్ ప్రతినిధుల పర్యటన

భీమవరం టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భీమవరం యూనిట్ 25వ వార్షికోత్సవం సందర్భంగా 10 రాష్ట్రాల నుంచి విచ్చేసిన 100 మంది మన ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. భీమవరం త్యాగరాజ భవనం నుంచి పర్యటనకు వెళ్లే వారి వాహనాన్ని జెండా ఊపి పంపించారు. ఈసందర్భంగా యూత్ హాస్టల్స్ చైర్మన్ డా సోమరాజు, మట్లపూడి సత్యనారాయణ, భీమవరం అధ్యక్షుడు చిలుకూరి నరసింహరాజు, కన్వీనర్ గన్నాబత్తుల శ్రీనివాస్, బ్రాండ్ అంబాసిడర్ చెరుకువాడ రంగసాయి, కార్యదర్శి నందమూరి రాజేష్, బోండా శ్రీరామ్, పాండురంగారావు మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి 100 మంది యూత్ హాస్టల్స్ ప్రతినిధులు భీమవరం విచ్చేశారని తెలిపారు. ఇక్కడి పర్యాటక కేంద్రలైన పంచారామక్షేత్రాలు, పెనుగొండ కన్యక పరమేశ్వరి, అంతర్వేది లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం దర్శనం చేయించామని తెలిపారు. యూత్ హాస్టల్స్ జాతీయ చైర్మన్ మనోజ్ జోహిరి, నేషనల్ వైస్ చైర్మన్ రబీ శంకర్‌పాల్ ఈ సందర్శన యాత్రలో పాల్గొన్నారని తెలిపారు. ఆదివారంనాడు త్యాగరాజ భవనంలో 25వ కోరల్ జూబ్లీ జాతీయ స్థాయి యూత్ హాస్టల్స్ సభ్యుల సమ్మేళనం నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అరేటి సత్యనారాయణ, జనపాటి మధుసుదన్ రావు తదితరులు పాల్గొన్నారు.



మరికొందరు ఎంపీహెచ్ఏ(మేల్)

ఉద్యోగులపై వేటు ?!

» ఉమ్మడి జిల్లాలో నోటిఫైడ్ పోస్టులకు మించి నియామకాలు » డీఎంహెచ్‌వో కార్యాలయంలో లంచావతారాల కనుసన్నల్లోనే అదనపు పోస్టులు ? » అనర్హులను వెలికితీయాలని వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వైద్యఆరోగ్యశాఖలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి జీవో 1207 ఉత్తర్వులను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇటీవల కొట్టివేస్తూ తీర్పు చెప్పిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంబంధిత జీవో పరిధిలో ఉద్యోగాలు చేస్తున్నవారిని తొలగించిన క్రమంలోనే మరికొందరిని కూడా విధుల నుంచి టెర్మినేట్ చేయనున్నట్లు తెలిసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లాలో ఇటీవల 111 మంది ఎంపీహెచ్ఏ(మేల్) ఉద్యోగులను టెర్మినేట్ చేస్తూ డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట ఉత్తర్వులు జారీచేసిన విషయం విధితమే. ఈ క్రమంలోనే మరికొందరు ఉద్యోగులు కూడా ఉన్నట్లు గుర్తించిన వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తాజాగా శుక్రవారం ఓ సర్క్యులర్‌ను పంపడంతో ఆ మేరకు సంబంధిత నియామకాల ఫైళ్లను పరిశీలించే ప్రక్రియ ప్రారంభమైంది. అందుతున్న సమాచారం ప్రకారం హైకోర్టు కొట్టి వేసిన జీవో 1207కు లోబడే ఉద్యోగ నియామకాల్లో మరికొందరు తమకు కూడా మెరిట్ ఉందని ఎంపీహెచ్ఏ(మేల్) ఉద్యోగాలను గత కొన్నేళ్ల క్రితం పొందినట్లు తెలుస్తోంది. ఇలా ఆయా సంవత్సరాల్లో కోర్టునుంచి ఉత్తర్వులు తెచ్చుకుని ఉద్యోగాలు పొందటం వెనుక డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొందరి హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ(మేల్) నియామకాలకు తొలుత జీవో 273 ఉత్తర్వులు విడుదలకాగా, ఉమ్మడి జిల్లాలో మొత్తం 205 పోస్టులు భర్తీ చేయాల్సిఉంది. ఈ ఉద్యోగాలకు విద్యార్హతలు, పాటించిన నిబంధనల్లో లొసుగులు ఉండటం, మరో జీవో 1207 విడుదల చేయడం అప్పట్లో జరిగాయి. ఈ నేపథ్యంలో నోటిఫైడ్ ఎంపీహెచ్ఏ(మేల్) పోస్టుల సంఖ్య 205కాగా, జీవోల్లో లొసుగులను ఉపయోగించుకుని సుమారు 340వరకు నియామకాలు జరిగినట్లు సమాచారం. ఇందులో జీవో 1207 ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఉద్యోగాలు పొందిన 111మందిని టెర్మినేట్‌చేయగా, ఇపుడు ఇదే జీవో మాటున మెరిట్ పేరిట ఉద్యోగాల్లోవున్న మరోకొందరిని కూడా తొలగించడానికి రాష్ట్ర ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. ఇలా దొడ్డిదారిన జరిగిన నియామకాలు ఈ ఏడాది అక్టోబరు వరకు కొనసాగినట్లు ప్రచారం జరుగుతోంది. తొలుత జారీ అయిన జీవో 273 ఉత్తర్వుల మేరకు కాంట్రాక్టు నియామకాలు పొందినవారిలో కొందరు చనిపోయిన, ఉద్యోగం మానేసిన ఉద్యోగులు, వారి రోస్టర్ పాయింట్లస్థానాల్లో ఇటీవలి వరకు కొత్తగా కొందరినిచేర్చి దొడ్డిదారి నియామకాలను డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ స్థాయి అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు లంచాలు తీసుకుని చేసినట్లు సమాచారం. ఇలా డబ్బులు తీసుకుని ఇటీవలి వరకు చేసిన నియామకాలను మాత్రం హైకోర్టు డిస్మిస్ చేసిన జీవో 1207పరిధిలోకి చేర్చలేదంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా అనర్హులైన మరికొందరు దర్జాగా ఉద్యోగాలు చేసుకుంటున్నారని సమాచారం. ఇపుడు అసలు జీవో 1207నే హైకోర్టు కొట్టివేసినందున, అదే జీవో మాటున మెరిట్‌తో ఉద్యోగాలు పొందినవారిని కూడా తొలగించాల్సిందేనని తాజాగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో దొడ్డిదారిన నియామకాలు పొందినవారితోపాటు, డీఎంహెచ్‌వో కార్యాలయ లంచావతారాలు కూడా బయటకు వస్తాయని ప్రచారం జరుగుతోంది. దీనిపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎంత మంది ఉద్యోగులపై ప్రభావితం చూపిస్తుందో అధికారిక ప్రకటన ఏదీ లేదు.

ప్రక్షాళనపూర్తయ్యాక కొత్తగా మళ్ళీ నియామకాలు

ఆద్యంతం వివాదాలు, కోర్టు కేసులు, దొడ్డిదారి నియామకాలు, ఆరోపణలు, లంచావతారాల విమర్శలపాలైన ఈ నియామకాల్లో నిర్ణీత అర్హతలు లేనివారిని తొలగించిన అనంతరం మిగిలివున్న ఖాళీలకు ఇప్పటి అవసరాల మేరకు కొత్తగా నోటిఫికేషన్ జారీచేసి నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఈ నియామకాల్లో కొత్త ట్విస్ట్ ఏంటంటే కొన్ని నెలలక్రితం జరిగిన కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల రెగ్యులరైజేషన్‌లో కొందరు వివాదాస్పద జీవో పరిధిలోనే ఉద్యోగాలు పొందినవారున్నట్టు సమాచారం. మొత్తంమీద కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ(మేల్) నియామకాల్లో గత కొద్దిరోజులుగా నెలకొన్న వివాదాలు, అధికారుల నిర్ణయాలు, వాటి ప్రభావం మరికొంతకాలం పాటు కొనసాగనున్నాయి.

క్రైమ్ కార్నర్



బీరువా బద్దలుగొట్టి వస్తువులు చెల్లాచెదురుగా పడవేసి ఉన్న దృశ్యం

బ్యాంకు కాలనీలో చోరీ

17 కాసుల బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదు అపహరణ

ఏలూరు క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి ఊరు వెళితే దొంగలు ఆ ఇంటితాళాలు పగులగొట్టి బంగారు వస్తువులు, నగదు అపహరించుకుపోయారు. ఏలూరు శాంతినగర్ ఆంధ్రాబ్యాంక్ కాలనీ, 4వ రోడ్డులో నివాసం ఉంటున్న ఆచంట రమణ ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నారు. ఇటీవల ఆయన శబరిమలై వెళ్ళారు. ఆయన భార్య కొవ్వూరులో ఉన్న బంధువుల వద్దకు వెళ్ళారు. శనివారం ఉదయం పక్కింటి వారు వెంటనే వారికి ఫోన్ చేసి చెప్పారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని, తలుపులు తీసి ఉన్నాయని చెప్పడంతో కొవ్వూరు నుంచి రమేష్ భార్య వచ్చి పరిశీలించారు. ఇంట్లోని 17 కాసుల బంగారు ఆభరణాలు, 40 వేల రూపాయల నగదు అపహరించుకుపోయారని ప్రాథమికంగా గుర్తించారు. ఈసంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు.

హైవోల్టేజీతో మీటర్ నుంచి మంటలు

దగ్ధమైన ఇల్లు.. రూ.8లక్షల ఆస్తినష్టం

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హైవోల్టేజితో విద్యుత్ మీటర్ నుంచి మంటలు వ్యాపించి ఇల్లు దగ్ధం అయిన ఘటన తాడేపల్లిగూడెంలో శనివారం చోటు చేసుకున్నది. పట్టణంలో జువ్వలపాలెంకు చెందిన నార్పరెడ్డి సూర్యప్రకాష్ వ్యాపారం చేసి జీవనం సాగిస్తుంటాడు. అయితే శనివారం ఉదయం ఒక్కసారిగా విద్యుత్ హైవోల్టేజి రావడంతో మీటర్ నుంచి భారీగా మంటలు వచ్చాయి. వెంటనే మంటలు ఇల్లంతా వ్యాపించాయి. దీంతో ఇంట్లోనీ ఏసీ యూనిట్, ఫ్యాన్‌లు, టీవి, ఫ్రిజ్‌లు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేలోపే స్థానికులు మంటలు ఆర్పారు. ఈ ప్రమాదంలో రూ.8లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి జీవి రామారావు తెలిపారు.

మోటార్ సైక్లిస్టు దుర్మరణం

ముదినేపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చేవూరుపాలెం గ్రామం వద్ద శుక్రవారం జరిగిన బైక్ ప్రమాదంలో చిలకలపూడికి చెందిన దాసరి నాగమల్లేశ్వరరావు దుర్మరణం చెందారు. సింగరాయపాలెం గ్రోవెల్ కంపెనీకి డ్యూటీకి వస్తుండగా, ఆ గ్రామం వద్ద కుక్కను తప్పించబోగా బైక్ అదుపు తప్పి క్రింద పడిపోయిన నాగమల్లేశ్వరరావు తలకు బలమైన గాయమైంది. వెంటనే పోలీసులు గుడివాడ ఆసుపత్రికి తరలించినా ఫలితం లేక మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

చాట్రాయి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): విజయవాడ-సత్తుపల్లి రహదారిలో సూరంపాలెం వద్ద శనివారం ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం కలగరకు చెందిన మిద్దే వెంకటేశ్వరరావు, సూరంపాలెంకు చెందిన జక్కం రాజేష్ గాయపడ్డారు. మిద్దే వెంకటేశ్వరరావును 108లో నూజివీడు ఆసుపత్రికి, జక్కం రాజేష్‌ని ప్రైవేటు వాహనంలో విజయవాడ హాస్పటల్‌కి తరలించారు.

మైనర్ బాలికకు యువకుడి వేధింపులు

» హెచ్చరించిన తండ్రి » కక్షగట్టిన యువకుడు » బాలిక తండ్రితో గొడవపడి కత్తితో పొడిచి హత్య

ఏలూరు క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లి మరణించడంతో తన ముగ్గురు ఆడ పిల్లలను అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నాడు. ఉన్నకాడికి తాపీపనులు చేస్తూ తన పిల్లలను పోషించుకుంటున్నాడు. పేదరికంలో ఉన్నప్పటికీ తన పిల్లలను పెద్దవారిని చేసి మంచి సంబంధాలు చేయాలనే ఆలోచనలో ఉన్నాడు. అయితే ఆ ముగ్గురు పిల్లలు కూడా 12 సంవత్సరాలలోపు వారే. అంతలోనే ఒక ఆకతాయి పెద్ద కుమార్తె వెంట పడ్డాడు. ఇది మంచి పద్ధతి కాదని ఆ తండ్రి మందలించాడు. అయినప్పటికి కూడా తన వేధింపులు ఎక్కువ కావడంతో తన కుమార్తెను రక్షించుకోవాలని ఆ తండ్రి ముగ్గురు పిల్లలను తీసుకుని మరో ఊరు వెళ్ళి జీవిస్తున్నాడు. పనిమీద ఏలూరు వచ్చిన అతనిని కక్ష పెంచుకుని ఉన్న ఆ ఆకతాయి ఏకంగా ఆతండ్రిని కత్తితో పొడిచి హతమార్చాడు. ఈ సంఘటన ఏలూరు నగరంలో శనివారం తెల్లవారు జామున జరిగింది. ఏలూరు త్రి టౌన్ సీఐ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం. ఏలూరు ఓవర్ బ్రిడ్జి కింద 39వ పిల్లర్ వద్ద నివాసం ఉంటున్న షేక్ వెంకట కనకరాజు (45)కు భార్య నాగమణి ఎనిమిది సంవత్సరాల క్రితం మరణించింది. అతనికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కనకరాజు ఆటో నడిపేవాడు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురానికి చెందిన నాని అనే యువకుడు తరచుగా ఓవర్ బ్రిడ్జి కిందకు వచ్చి కనకరాజు పెద్ద కుమార్తె (12)ను వేధించేవాడు. తనకు ఇచ్చి పెళ్ళి చేయాలని లేదంటే ఎవరినో ఒకరిని చంపివేస్తానని బెదిరించేవాడు. ఈ నేపథ్యంలో కనకరాజుకు, నానికి గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో తమ పిల్లలను కాపాడుకోవడానికి ఆ ముగ్గురు పిల్లలను తీసుకుని ఉంగుటూరు మండలం నారాయణపురం వెళ్ళి అక్కడే ఉంటూ తాపీ పనులకు వెళ్తున్నాడు. ఈనెల 13వ తేదీ ఉదయం 39వ పిల్లర్ వద్ద అతను నివాసం ఉన్న నాగిరెడ్డి గంగలక్ష్మి ఇంటి వద్దకు వచ్చి ఉన్నాడు. తిరిగి సాయంత్రం వరకూ అక్కడే పడుకుని రాత్రి కూడా ఆ ఇంటి బయటే పడుకుని ఉన్నాడు. కనకరాజు వచ్చిన సంగతి నాని తెలుసుకుని శుక్రవారం రాత్రి ఆ ప్రాంతంలోనే సంచరించి కనకరాజు ఎక్కడ ఉన్నాడంటూ కొంతమందిని అడిగినట్లు చెబుతున్నారు. శనివారం తెల్లవారుజామున కనక రాజుతో నాని గొడవ పెట్టుకుని అతని కుమార్తెను ఇచ్చి పెళ్ళిచేయాలని బెదిరింపులకు పాల్పడి చివరకు కత్తితో పొడిచి హతమార్చి పరారీ అయ్యాడు. శనివారం ఉదయం ఈ సంఘటనపై ఆ ప్రాంత గ్రామ, వార్డు సంక్షేమ కార్యదర్శి (మహిళ పోలీస్) సిరిమళ్ళ నాగ దుర్గాభవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రి టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. మరోవైపు నాని కోసం ప్రత్యేక బృందాలను గాలింపుల్లోకి దించారు. ఆదివారం శవపంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిర్వహించనున్నారు. కనకరాజు బంధువులకు సమాచారం ఇచ్చారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న త్రి టౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు

ముగ్గురు అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం

కైకలూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చోరీ జరిగిన పది రోజుల్లోనే అంతర్ జిల్లా దొంగలను కైకలూరు టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను సీఐ పి. కృష్ణ వెల్లడించారు. కైకలూరు పాముల కాలనీలో ఈ నెల మూడోవ తేదీ తాళం వేసి ఉన్న ఇంటిలో వెండి, బంగారం అభరణాలను చోరీ చేశారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వేగవంతంగా దర్యాప్తు నిర్వహించి పది రోజుల వ్యవధిలో ముగ్గురు అంతర్‌జిల్లాల దొంగలను అరెస్టు చేశారు. వీరిపై కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో అనేక చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. ఏలూరు 5వ డివిజన్ ఉర్దూ పాఠశాల దగ్గరలో నివశిస్తున్న షేక్ మున్నా, ఏలూరు కండ్రికగూడెం కొత్త రామాలయం దగ్గర నివసిస్తున్న ఉప్పాడ కార్తీకసాయి, ఏలూరు తంగేడు పంచాయతీ పరిధిలోని కుమారి దేవి రావిచెట్టు దగ్గర నివసిస్తున్న పొట్లూరి హరి కలిసి ఇళ్ళకు తాళాలువేసిన వాటిని గుర్తించి రాత్రికి రాత్రి చోరీలకు పాల్పడుతున్నారు. కైకలూరు టౌన్ ఎస్సై డి. వెంకట్‌కుమార్ వచ్చిన సమాచారం మేరకు కైకలూరు రైల్వేస్టేషన్ దగ్గర సంచరిస్తున్న ముగ్గురు యువకులను అదుపులో తీసుకుని విచారణ చేయగా చోరీలకు పాల్పడిన సంఘటన వెలుగులోనికి వచ్చినట్లు సీఐ తెలిపారు.

పోలీసులపై దొంగ నోట్ల ముఠా దాడి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సినీఫక్కీ తరహాలో రాజమహేంద్రవరంలో శ్రీకాకుళం పోలీసులపై ఎటాక్ చేసి పారిపోయిన దొంగ నోట్ల ముఠాను పట్టుకునేందుకు తూర్పుగోదావరి జిల్లా పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలను నియమించారు. ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు బృందాలు దొంగ నోట్ల ముఠా ఆచూకీ కోసం గాలిస్తున్నాయి. దొంగ నోట్ల ముఠాలోని కీలక వ్యక్తి పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన ప్రభాకర్‌ను భీమవరంలో అరెస్టు చేసిన శ్రీకాకుళం పోలీసులు అతన్ని రాజమహేంద్రవరంలో ఉన్న మరొక వ్యక్తిని అరెస్టు చేసేందుకు శుక్రవారం రాత్రి కారులో బయలు దేరారు. అయితే రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్-వీఎల్ పురానికి మధ్య శ్రీకాకుళం పోలీసులపై ఎటాక్ చేసి రెండు కార్లలో దొంగనోట్ల ముఠా సభ్యులు ప్రభాకర్‌ను తీసుకెళ్లిపోయారు.ఈ సంఘటనపై రాజమహేంద్రవరం ప్రకాశ్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులపై దాడి చేసిన సంఘటనపై పోలీసులు చాలా తీవ్రంగా పరిగణించి ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈదొంగల ముఠాలో రాజమహేంద్రవరానికి చెందిన మూర్తి అనే వ్యక్తి ఎవరనే దానిపై ఉత్కంఠం నెలకొంది. ఈ ముఠాతో రాజమహేంద్రవరానికి ఉన్న లింక్ నేపథ్యంలో కేసు దర్యాప్తు సాగుతున్నట్టు తెలిసింది. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

అధికారి పేరుతో రూ.50 వేలు టోకరా

నరసాపురం, డిసెంబరు 14: పై అధికారినంటూ ఏలూరులోని అటవిశాఖలో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగికి ఆన్‌లైన్ మోసగాడు రూ.50వేలు టోకరా వేశాడు. అయితే కేటుగాడికి సొమ్ము నరసాపురంలో పని చేస్తున్న మరో ఉద్యోగి చెల్లించడంతో ఈ సైబర్ మోసం కేసు నరసాపురం టౌన్ స్టేషన్‌లో నమోదైంది. సీఐ యాదగిరి వివరాలు ప్రకారం ఏలూరులో పని చేస్తున్న ఓ జిల్లా స్థాయి అధికారికి శుక్రవారం వాట్సప్‌లో ఓ మెసేజ్ వచ్చింది. నా పేరు చిరంజీవి చౌదరి. మీ పైస్థాయి అధికారిని. మీ వాట్సప్‌కి నా అకౌంట్‌ని నా బ్యాంకు ఖాతా వివరాలు పెట్టాను. దానికి రూ.50 వేలు పంపండి అంటూ మెసేజ్ పెట్టారు. ఆ శాఖలో ఆ పేరుతో ఓ అధికారి ఉండటంతో ఆ ఉద్యోగి నిజమనుకుంది. అయితే సొమ్ము లేకపోవడంతో నరసాపురం కోర్టు లో పని చేస్తున్న తన సమీప బంధువు రత్న కిషోర్‌కు ఫోన్ చేసి వాట్సప్‌కు పంపిన అకౌంట్ నెంబరుకు రూ.50 వేలు పంపమని కోరింది. వెంటనే అతను ఆ మొత్తాన్ని అకౌంట్ నెంబర్‌కు పంపించాడు. ఇది జరిగిన కొద్ది సేపటికి మరో అకౌంట్ నెంబరు పంపి దీనికి కూడా రూ.50 వేలు పంపాలని మెసేజ్ పెట్టాడు. దీంతో ఆ మహిళా ఉద్యోగికి అనుమానం వచ్చింది. వెంటనే తన పైఅధికారికి ఫోన్ చేసి విషయం చెప్పింది. విచారించిన అతను మోసం అని తేల్చాడు. వెంటనే ఆమె ఈ విషయాన్ని నరసాపురంలో డబ్బును పంపిన రత్న కిషోర్‌కి ఫోన్ చేసి చెప్పింది. జరిగిన మోసాన్ని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

జల్లేరు బస్సు ప్రమాదానికి మూడేళ్లు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేలేరుపాడు నుంచి జంగారెడ్డిగూడెం వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు జంగారెడ్డిగూడెం మండలంలోని జల్లేరు బ్రిడ్జిపై నుంచి అదుపుతప్పి జల్లేరు వాగులో పడిపోగా పది మంది మృతి చెందడంతో పాటు 25 మందికి తీవ్ర గాయాలైన ఘటన జరిగి నేటికి సరిగ్గా మూడు సంవత్సరాలైంది. 2021 డిసెంబరు 15వ తేదీన మధ్యాహ్నం 12 సమయంలో మరికొద్ది నిమిషాల్లో జంగారెడ్డిగూడెం చేరుకుంటామనుకున్న సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న 49 మంది ప్రయాణికులు అనుకునే లోపే బస్సు అదుపు తప్పి బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొట్టుకుంటూ వాగులో పడిపోయింది. బస్సు నీటిలో పడిన వెంటనే ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో ఉన్న కొందరు ఉక్కిరిబిక్కిరై తమ ప్రాణాలను విడిచిపెట్టారు. చుట్టు పక్కల పని చేసుకునే కూలీలు, అటుగా వెళ్తున్న ప్రయాణికులు తమ సర్వశక్తులు ఒడ్డి బస్సులో ఉన్న ప్రయాణికులను కాపాడారు. అప్పటికే తొమ్మిది మంది మృతి చెందారు. వైద్యం పొందుతూ మరొకరు మృతి చెందారు.



జల్లేరువాగులో పడిపోయిన బస్సు (ఫైల్)

మానని గాయం

మూడు సంవత్సరాల క్రితం జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు నేటికీ ఈ ఘటన మానని గాయంగా ఉందని చెబుతున్నారు. మృతుల్లో ఇద్దరు జంగారెడ్డిగూడెం మండలానికి చెందినవారున్నారు. మండలంలోని ఏ పోలవరం గ్రామానికి చెందిన పాలడుగుల మహాలక్ష్మి (50)కి రెండు రోజుల క్రితమే శాస్త్రోక్తంగా వర్ధంతి కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు నిర్వహించారు. మహాలక్ష్మి కుమారుడు కుమార్ తన తల్లి మృతి చెందే నాటికి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. నేడు రాజమండ్రిలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. తన తల్లి లేని లోటు ప్రతి రోజు కనిపిస్తుందని కన్నీటి పర్యంతమయ్యాడు. తన తండ్రి తాను ఆమె జ్ఞాపకాలతో బతుకుతున్నామని అన్నారు. అలాగే మండలంలోని చిన్నవారిగూడెం గ్రామానికి చెందిన మధు (48) ప్రమాదంలో మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులు నేటికీ కృంగిపోతూనే ఉన్నారు. ప్రస్తుతం జల్లేరు బ్రిడ్జి వద్ద ప్రమాదాలు జరగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. బ్రిడ్జి రెయిలింగ్ ను కూడా పటిష్టంగా నిర్మించారు.



కురెళ్లగూడెం నీటి సంఘం అధ్యక్షుడిని అభినందిస్తున్న గన్ని వీరాంజనేయులు



మల్లాయిగూడెంలో నీటి సంఘానికి ఎన్నికైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అధికారులు



జాలిపూడిలో నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రబోస్ నియామకపత్రాలు అందచేస్తున్న ఎన్నికల అధికారి

ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

నీటి సంఘాల్లో కూటమిదే హవా.. జిల్లా వ్యాప్తంగా ఏకగ్రీవం

జిల్లావ్యాప్తంగా సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. అధిక సంఖ్యలో నీటి సంఘాలు కూటమి నాయకులకే ఏకగ్రీవంగా దక్కాయి.

'దెందులూరు'లో 26 సాగునీటి సంఘాలు

దెందులూరు, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : దెందులూరు మండలంలో 22 మైనర్ సాగునీటి సంఘాలు మొత్తం 26 సాగునీ టి వినియోగ దారుల సంఘాలకు ఎన్నికలు జరగడంతో మేజర్ సంఘాలైనా దెందులూరు, పోతునూరు, కొవ్వలి దోసపాడుతో సహా అన్నిచోట్ల టీడీపీ కూటమి మద్దతుదారులు ఏకగ్రీవంగా అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా, మెంబర్లుగా గెలుపొం దారు. గోపన్నపాలెం అధ్యక్షుడిగా చమళ్లమూడి రాము, సానిగూడెం అధ్యక్షుడు యలమర్తి శ్రీనుబాబులతో పాటు పలు చోట్ల గెలుపొందిన సాగునీటి వినియోగదారుల అధ్యక్షులను టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లుబాబు) అభినందించారు.

'పెదపాడు'లో 18 నీటి సంఘాలు ఏకగ్రీవమే

పెదపాడు : పెదపాడు మండలంలోని 18 నీటి సంఘాలకు ఎన్నికలు ప్రశాంతంగా జరగ్గా, అన్ని ఏకగ్రీవంగా దిశగా సాగాయి. బొప్పిడి కాశీబాబు (పెదపాడు-1), దావాల రమేష్ (పెదపాడు-2), కలిపిండి అప్పారావు (ముప్పర్రు), కొమ్మన శ్రీధర్ (వట్లూరు పెదచెరువు), గుండుబోయిన రాజా (రాజుపేట), పిలగల వీరాంజనేయులు (గోగుంట), పిడుగు రామకృష్ణ (కొణికి), రావాడ గాంధీ (సత్యవోలు), డోకల సూర్యప్రభాకర్ (వట్లూరు), వనం రఘురామ్ (కొత్తముప్పర్రు), పాతూరి రామ్మోహనరావు (కొక్కిరపాడు), కె.సాంబశివరావు (బాబుఖాన్‌చెరువు), మన్నెం సత్యనారాయణ (వేంపాడు), గొరినేని సీతారాంబాబు (కొక్కిరపాడు కొత్త ట్యాంక్), నందిగం సత్యనారాయణ (కొక్కిరపాడు ఎర్ర ట్యాంక్), గోళ్ళ ప్రకాశరావు (కలపర్రు కామిని ట్యాంక్), కొండపావులూరి వెంకట దుర్గాప్రసాద్ (ఏపూరు మావుళ్ళ ట్యాంక్), రాజులపాటి అప్పారావు (అప్పనవీడు పెదవెంకన్న చెరువు) అధ్యక్షులుగా కూటమి నాయకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని పెదపాడు, ముప్పర్రు డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్‌ల ఎన్నిక ఏకగ్రీవం కానుంది.

'పెదవేగి'లో 17 సాగునీటి సంఘాలు

పెదవేగి : పెదవేగి మండలంలో మొత్తం 17 సాగునీటటి సంఘాలు ఉండగా, అన్నీకూడా కూటమి సభ్యులకే ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కొన్నిచోట్ల నామినేషన్ వేయడానికి కూడా అభ్యర్థులు కరువయ్యారు. పార్టీ నేతలే ఓటర్ల జాబితాలో పేర్లను చూసి, తమకు అనుకూలురైన రైతులను అప్పటికప్పుడు తీసుకొచ్చి వారితో నామినేషన్లు వేయించారు. కాగా ఎక్కడా కూడా రెండో నామినేషన్ అనేది వేయకపోవడంతో ఎన్నిక ప్రక్రియ లాంఛనమే అయింది. అన్నిచోట్లా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఎన్నికైన వారిని కూటమి నాయకులు అభినందించారు.

'చింతలపూడి'లో 18 సంఘాలు

చింతలపూడి : చింతలపూడి మండలంలో మొత్తం 18 సాగునీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. అందరూ కూటమికి చెందిన అభ్యర్థులే ఎన్నికయ్యారు. వీటిలో 17 మైనర్ ఇరిగేషన్ సాగునీటి సంఘాలు కాగా ఒకటి మీడియం ఇరిగేషన్ సాగునీటి సంఘం ఉంది. శెట్టివారిగూడెంలోని మేడవరపుచెరువు ఒక టీసీ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయలేదు. 114 మంది టీసీలు ఉండగా 113 మంది ఎన్నికయ్యారు. 18 సాగునీటి సంఘాల అధ్యక్షులలో రాఘవాపురం టీఎల్ఎస్ చానల్-1 సంఘానికి అడపా లక్ష్మి జనసేన అభ్యర్థి ఏకగ్రీవం కాగా 17 సంఘాల అధ్యక్షులు టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు. వివరాలు ఇలా.. తిమ్మిరెడ్డిపల్లి చెక్‌డ్యాం అధ్యక్షుడు యర్రగొర్ల మల్లయ్య, ఉపాధ్యక్షురాలు తేలం శివకుమారి, మేడవరపు చెరువు అధ్యక్షుడు ఆది అంజనేయులు, ఉపాధ్యక్షుడు గరిగింటి వెంకటేశ్వరరావు, ప్రగడవరం బూరుగువాగు అధ్యక్షుడు తొమ్మండ్రు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బేతి మహాలక్ష్ముడు, పెద్దచెరువు సంఘం అధ్యక్షుడు గోలి చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యక్షుడు కలకోట గోపాల్, చుండ్రువానికుంట సంఘం అధ్యక్షుడు కనిపెడ జయరాజు, ఉపాధ్యక్షుడు జయవరపు సూర్యనారాయణ, గొల్లకుంట చెరువు అధ్యక్షుడు బందెల రాజబాబు, ఉపాధ్యక్షుడు గరిగంటి వెంకట రామకృష్ణ, రాఘవాపురం టీఎల్ఎస్-1 అధ్యక్షురాలు అడపా లక్ష్మి, ఉపాధ్యక్షులు వలసపల్లి పర్వతరావు, రాఘవాపురం వెంకమ్మచెరువు సంఘం అధ్యక్షుడు బాల నరసింహారావు, ఉపాధ్యక్షుడు శెట్టిపల్లి ప్రసాద్, అక్కసాగరం చెరువు సంఘం అధ్యక్షుడు వీరంకి రామారామారావు, ఉపాధ్యక్షుడు తొర్లపాటి సత్యనారాయణ, ఎండపల్లి ఎర్రచెరువు అధ్యక్షుడు తాటిపర్తి వెంకయ్య, ఉపాధ్యక్షుడు పెండ్యాల హరిరామకృష్ణయ్య, యర్రగుంటపల్లి కళ్యాణరాయుడు చెరువు అధ్యక్షుడు నారాయణపురం రామారావు, ఉపాధ్యక్షుడు నెరుసు సత్యనారాయణ, యర్రగుంటపల్లి సాయమ్మచెరువు అధ్యక్షుడు రెబ్బా ధర్మారావు, ఉపాధ్యక్షుడు గాండ్ల మల్లికార్జునరావు, ఎర్రగుంటపల్లి కొండసముద్రం సంఘం అధ్యక్షుడు ఓలేటి వెంకట నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస రెడ్డి, చింతలపూడి పెద్ద చెరువు అధ్యక్షుడు ఆలపాటి పట్టాభిరామయ్య, ఉపాధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు, కోపులగుంట చెరువు అధ్యక్షుడు ఆలపాటి శ్రీధర్, ఉపాధ్యక్షుడు బోయిన మధు, విశ్వసాగరం చెరువు అధ్యక్షుడు హెచ్చు యోహాన్, ఉపాధ్యక్షురాలు సందిపాం నాగమణి, టీఎల్ఎస్ చానల్-1 అధ్యక్షురాలు అడపా లక్ష్మి, ఉపాధ్యక్షులు వలసపల్లి పర్వతరావు, టీఎల్ఎస్-2 మల్లాయి గూడెం సంఘం అధ్యక్షుడు చీకటి బాబూరావు, ఉపాధ్యక్షులు వనమాల శ్రీనివాసరావు ఎన్నిక య్యారు. కాగా కూటమి అభ్యర్థుల ఏకగ్రీవ విజయంతో సంఘాల కార్యవర్గాలకు పలువురు అభినందనలు తెలిపారు. వీరిలో నియోజకవర్గ మాజీ టీడీపీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి, జనసేన నాయకులు చీదరాల మధుబాబు, టీడీపీ నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, ఆదిజగన్, ఆది సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ కె.రాజశేఖరరెడ్డి, మాటూరి వెంకట్రామయ్య పలువురు ఈ సంఘాల కార్యవర్గాలకు అభినందనలు తెలిపారు.

కామవరపుకోట మండలంలో..

కామవరపుకోట : కామవరపుకోట మండలం గుంటుపల్లి పంచాయతీలో శనివారం జరిగిన నీటి సంఘం కార్యవర్గం ఎన్నిక టీడీపీ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. ఈమేరకు ఛైర్మన్‌గా బలుసు రాధాకృష్ణ, వైస్ ఛైర్మన్‌గా సత్తెనపల్లి రాంబాబు, టీసీలుగా వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, తుమ్మల రామారావు, తుమ్మల కిరణ్‌రమేష్, సాయిల భానులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. వారితో తహసీల్దార్ గెద్దం ఎలీషా ప్రమాణ స్వీకారం చేయించారు.

ఏలూరు మండలంలో ఐదు నీటి సంఘాలు ఏకగ్రీవం

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండల పరిధిలో ఐదు నీటిసంఘాల ఎన్నికలు శనివారం ఏకగ్రీవమయ్యాయి. పాలగూడెం నీటిసంఘం అధ్యక్షుడిగా సుంకరమాధవరావు, ఉపాధ్యక్షుడిగా మాగంటి కృష్ణమోహన్, జాలిపూడి, కృష్ణ, ఈస్ట్రన్ కెనాల్‌కు సంబంధించి అధ్యక్షుడిగా మాగంటి నవీన్‌చంద్రబోస్, ఉపాధ్యక్షుడిగా చుక్కా వెంకటేశ్వర్లు, మాదేపల్లి -అధ్యక్షుడిగా సీహెచ్ సాల్మన్ రాజు, ఉపాధ్యక్షుడిగా అమన్‌రమణ, శ్రీపర్రు-అధ్యక్షుడిగా ఘంటసాల హరికృష్ణ, ఉపాధ్యక్షుడిగా తలారి చిన్నప్రకాశం, చాటపర్రు-మూల్పూరి వీరభద్రరావు, ఉపాధ్యక్షుడిగా వేమిరెడ్డి సత్యనారా యణ ఏకగ్రీవం ఎన్నికయ్యారు. నీటిసంఘం ఎన్నికలకు వైసీపీ దూరంగా ఉంది.

'ఉంగుటూరు'లో ఏడు ఏకగ్రీవమే..

ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో శనివారం జరిగిన నీటి సంఘం ఎన్నికలలో మూడు సెగ్మెంట్లలో నామినేషన్లు దాఖలు కాలేదు. కాగా ఏడు మేజర్ నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాని తహసీల్దార్ వై.పూర్ణచంద్రరావు తెలిపారు. కైకరం మేజర్ నీటి సంఘానికి సంపతి వెంకటేశ్వరరావు అధ్యక్షుడిగా, పామర్తి నాగ వెంకటభాస్కరకిరణ్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. చేబ్రోలు అధ్యక్ష ఉపాధ్యాక్షులుగా గోలి ప్రసాద్, వేమూరి శ్రీనాథ్, దొంతవరంలో శ్రీరెడ్డిసత్యనారాయణ, బొమ్మిడిలో కోడూరి కాశీ విశ్వనాథం, నల్లమాడు చెర్వుకు తమ్మిన సోమరాజు, ఉంగుటూరు పట్టెమ్మ చెర్వుకు సుంకవల్లి శ్రీహరి, కైకరం కొత్తచెర్వుకు గుత్తికొండ అప్పారావు, గోపీనాథపట్నం చెర్వుకు ముళ్ళపూడి ప్రసాద్, రాచూరుకు మండా నాగేశ్వరరెడ్డి, ఉంగుటూరు మేజర్ సంఘానికి రెడ్డి ప్రసాద్ ఎన్నికయ్యారు. బాదంపూడికి వంకిన కృష్ణారావు, వెల్లమిల్లి వీరభద్రుని కర్రచెర్వుకు వల్లభని రామాంజనేయులు ఎన్నికయ్యారు.

నిడమర్రు మండలంలో 6 సంఘాలు..

నిడమర్రు : నిడమర్రు మండలం లో అడవి కొలను, ఛానమిల్లి, చిననింద్రకొలను, నిడమర్రు, పెదనింద్రకొలను, వెంకటాపురం మొదలగు 6 నీటి సంఘాలకు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు తహసీల్దార్ ఎస్.నాగరాజు తెలిపారు. ఈ ఎన్నికలలో మొత్తం 72 టీసీలకు మెంబర్లను ఎన్నుకున్నారు. అడవికొలను నీటి సంఘం అధ్యక్షుడిగా - కోటిపల్లి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడిగా పాపోలు మురళీకృష్ణ, ఛానమిల్లి నీటి సంఘం అధ్యక్షుడిగా బేతు వెంకట శివరామారావు, ఉపాధ్యక్షుడిగా ఆదిరెడ్డి వెంకట్రావు, చిననింద్రకొలను అధ్యక్షుడిగా చింతలపాటి మూర్తిరాజు, ఉపాధ్యక్షుడిగా పల్లి వెంకట నరసింహరావు, నిడమర్రు అధ్యక్షుడిగా అంబళ్ల వేణుప్రసాద్, ఉపాధ్యక్షుడిగా నత్తినీడి వెంకటసాయిఅప్పాజీ, పెదనింద్రకొలను అధ్యక్షుడిగా అయితం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కొప్పుల వెంకట లక్ష్మణరావు, వెంకటాపురం అధ్యక్షుడిగా చెల్లంశెట్టి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బాలం సత్యనారాయణ ఎన్నుకున్నారు.

'పోలవరం'లో 30 సంఘాలు

పోలవరం : పోలవరం మండలంలో 30 నీటి వినియోగదారుల సంఘాలకు జరిగిన ఎన్నికలలో అన్నీ కూటమి అభ్యర్థులకే ఏకగ్రీవమయ్యాయి. పోలవరం కొత్తూరుచెరువు నీటి సంఘం ఛైర్మన్‌గా పోలవరానికి చెందిన పాదం ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఛైర్మన్‌గా పప్పల బాలాజీ, పట్టిసీమ కొవ్వాడ సంఘం ఛైర్మన్‌గా పందిటి పోశారావు, వైస్ ఛైర్మన్ రొంగల వెంకట్రావు, ప్రగడపల్లికి చెందిన ఒక టీసీ ఎన్నిక అభ్యర్థి లేక ఆగింది. పట్టిసీమ చెల్లాయమ్మ ఛైర్మన్‌గా సానా శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ పొన్నూరి వెంకటేశ్వరి, కొత్తపట్టిసీమ మంగపతిదేవి ఛైర్మన్‌గా వీరపుశెట్టి వెంకటరత్నం, వైస్ ఛైర్మన్‌గా ఇమ్మణి గణపతి రామారావు, గూటాల జనపతి గట్టు ఛైర్మన్‌గా తాళ్ళపూడి వెంకటరమణ, వైస్ ఛైర్మన్‌గా తోట రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'బుట్టాయగూడెం'లో 22 సంఘాలు

బుట్టాయగూడెం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి) : బుట్టాయగూడెం మండలంలో మొత్తం 22 సంఘాలు ఉండగా 132 టీసీలు ఉన్నాయి. 127కు ఎన్నిక జరగ్గా రైతులు అందుబాటులో లేకపోవడంతో జైనవారిగూడెం-1, పాలకుంట-1, పైదావారిగూడెం-2, దొరమామిడి-1లకు ఎన్నికలు జరగలేదు. 122 టీసీలు ఏకగ్రీవం అయ్యాయి. 22 సాగునీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను టీటీఉ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీతారామంగవరం చిన్న చెరువు ఆరు టీసీలకు గాను ఒక టీసీ ఎన్నిక నిలిచిపోయింది. స్థానిక ఆయకట్టు గిరిజన రైతులు టీసీగా తమకు అవకాశం ఇవ్వాలని పట్టుబట్టారు. ఎన్నికల ప్రక్రియ రోజున తమకు అవకాశం ఇవ్వాలనడం సరైందికాదని ప్రస్తుతం తానేమి చేయలేనని తహసీల్దార్ చెప్పడంతో గిరిజన రైతులు ఎన్నిక జరగకుండా నిలుపుదల చేశారు. టీడీపీ, జనసేన, సీపీఎం, వైసీపీకి చెందినవారు పదవులను సొంతం చేసుకున్నారు.

'టి.నరసాపురం'లో నాలుగు సంఘాలు

టి.నరసాపురం : మండలంలో నాలుగు సాగు నీటి సంఘాలకు అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తహసీల్దార్ టి.ఎస్ సాయిబాబా తెలిపారు. టి.నరసాపురం నందమూరి విద్యాసాగర్ చెరువు అధ్యక్షుడిగా కొనకళ్ళ మోహన్‌కుమార్, మక్కినవారిగూడెం జమ్మి చెరువు అధ్యక్షుడిగా దామిశెట్టి కేశవరావు, తిరుమలదేవిపేట లక్ష్మీనరసింహసాగర్ చెరువు అధ్యక్షుడిగా గండబోయిన అప్పలనారాయణ, అప్పలరాజుగూడెం, అప్పలరాజు చెరువు అధ్యక్షుడిగా తాళ్ళ దుర్గారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

కొయ్యలగూడెంలో 11 సంఘాలు

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం మండలంలో 11 సాగు నీటి సంఘాలను కూటమి నాయకులు ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నారు. అంకాలచెరువు సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా మాటూరి కృష్ణనాగవరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా యరమల్ల శ్రీను, నూతికుంట చెరువుసాగు నీటి సంఘం అధ్యక్షుడిగా తోట రామకృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా తోట సత్యనారాయణ, రాజుచెరువు అధ్యక్షుడిగా యాతం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా తీగుతిపల్లి భారతి, భీముడు చెరువు అధ్యక్షుడిగా యనమదల అచ్యుతరామయ్య, ఉపాధ్యక్షుడిగా కోన నాగేశ్వరరావు, ఎర్రకాలువ నీటి సంఘం అధ్యక్షుడిగా వాడపల్లి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడిగా నేలపోలు సత్యనారాయణ, బోలుచెరువు అధ్యక్షుడిగా గేలం అప్పారావు, ఉపాధ్యక్షుడిగా పారేపల్లి వీర వెంకట సత్యనారాయణ, ఎర్రచెరువు అధ్యక్షుడిగా అప్పన సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా గోళ్ళ దుర్గారావు, వడిసెలవాని చెరువు అధ్యక్షుడిగా గెడా రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడిగా గెడా రమేష్, అప్పన్న చెరువుకు చేబోలు వెంకట రాంబాబు, ఉపాధ్యక్షుడిగా యండపల్లి గంగరాజు, పెద్దచెరువు అధ్యక్షుడిగా తోలేటి నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడిగా సొంఠెం సురేష్‌బాబు, హుకుంపేట చెరువు అధ్యక్షుడిగా కనుమూరి సీతారామరాజు, ఉపాధ్యక్షుడిగా పారేపల్లి వీరాస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

లింగపాలెంలో అన్నీ ఏకగ్రీవమే..

లింగపాలెం : లింగపాలెం మండలంలో 18 మైనర్, 2 మేజర్ సంఘాలకు ఎన్నికలు అన్నీ ఏకగ్రీవమయ్యాయి. ధర్మాజీగూడెం పాలవాగు సప్లై చానల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మోరంపూడి వరప్రసాద్, మేకల రాధాకృష్ణ, టీసీహెచ్ఆర్ పాలెం తమ్మిలేరు రిజర్వాయర్-తక్కెళ్లపాటి వెంకటేశ్వరరావు, పొల్లుబోయిన రాధాకృష్ణ, యడవల్లి తమ్మిలేరు రిజర్వాయర్ - 2కు చెలికాని వెంకటేశ్వరరావు, పలగాని కోటేశ్వరరావు, టీసీహెచ్ఆర్ పాలెం పెద్దచెరువు మరిడి సదాశివ రావు, పొదిల దాసు కె.గోకవరం చాకిరేవుపాడు చెరువు, కోట విజయలక్ష్మి, బలుసు రామకృష్ణ అర్జునరావు. బాదరాల పెద్దచెరువు బొల్లినేని వెంకటేశ్వరరావు, మఠంగూడెం ఊరచెరువు కడియాల శ్రీనివాస రావు, బి.ఈశ్వరరావు, వేములపలి బాగులచెరువు-పాతూరి నాగేశ్వరరావు, పిండి వెంకటేశ్వరరావు, సింగగూడెం ఊరచెరువు - బొల్లిన రామారావు, తాతిన సత్యనారాయణ. కలరాయనగూడెం ఈదుల నందిగుంట చెరువు-ముసునూరి గంగాధరరావు, వరుగు శీతారామయ్య, మఠంగూడెం-1 సురసముద్రం- కనకవల్లి రామచంద్రరావు, మందపు ధనుంజయరావు. భోగోలు పెద్దచెరువు - ఉల్లెపాలెపు వెంకటసత్యనారాయణ, పలగాని మహేష్. కె.గోకవరం పెద్దచెరువు-మొగళ్ల నాగేశ్వరరావు, కురమల రామకృష్ణ. ఆసన్నగూడెం కల్లేపల్లిచెరువు - మామిడిపల్లి నాగరాజు, పొన్నూరి గంగరాజు. వెంకటాపురం(భోగోలు) బొంతు సత్యనారాయణ, బొంతు సత్యనారాయణ. రంగాపురం బాపయ్య చెరువు - బొంతు సుబ్బారావు, మునికుంట వెంకటేశ్వరరావు, పాచ్యానగరం పెద్దచెరువు-మొగుళ్ల సాయికృష్ణ, తొమ్మండ్రు లక్ష్మణరావు. అయ్యప్పరాజుగూడెం తాళ్లచెరువు - సుసాని సాంబశివరావు, ముల్పూరి సుబ్బారావు. నరసన్నపాలెం వామనకుంట-కలవకొల్లు సత్యనా రాయణ, కొత్త కేశవరావు కొత్తపల్లి కొత్తచెరువు- షేక్‌రహమాన్‌తుల్లా, కొల్లి లక్ష్మీపతిరావులను ఎన్నుకున్నారు.

ద్వారకాతిరుమలలో 13 నీటి సంఘాలు ఏకగ్రీవం

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల మండలంలోని 13 నీటిసంఘాలు ఏకగ్రీవమయ్యాయి. తిమ్మాపురం, సత్తాల, తిరుమలంపాలెంలో 3, పంగిడిగూడెం, నారాయణపురం పరిదిలో 7 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. కూటమి బలపరిచినవారే ఎన్నికల్లో పాల్గొన్నారు. మొత్తం 78 టీసీలకు 61 టీసీలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 17 టీసీలు ఖాళీగా ఉన్నట్లు తహసీల్దార్ జేవీ సుబ్బారావు తెలిపారు. ఈ 17 టీసీలకు ఓటర్లు కూడా ఎవరూ రాలేదని వివరించారు.

భీమడోలులో 11 సంఘాలు..

భీమడోలు : భీమడోలు మండలంలో 11 నీటి వినియోగదారుల సంఘంలో ఆరు మేజర్, ఐదు మైనర్ సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపి క ఏకగ్రీవమైంది. భీమడోలు అధ్యక్షుడిగా కుక్కల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షు డు ముప్పిడిశెట్టి శివ, ఆగడాలలంక- గోలి రామారావు, పాండురంగ రాజు, అంబర్‌పేట -ఏపూరి శ్రీనివాసరావు, కేతినీడి సత్యనారాయణ, చెట్టున్నపాడు-రుద్రరాజు రామ కృష్ణంరాజు, ముంగర పెద్దిరాజు, అంబర్‌పేట ఎర్రచెరువు-దాసరి వెంకటేశ్వరరావు, మల్లుల కృష్ణ, అంబర్‌పేట రెడ్డియ్యకుంట- కె.వెంకట నరసమ్మ, వి.డేవిడ్‌రా జు, దుద్దేపూడి -1 - నీలం వెంకట రమణారావు, నీలం శ్రీనివాసరావు, దుద్దేపూడి-2 - అన్నెం రామాంజనేయులు, నెక్కంటి కార్తీక్, పోలసానపల్లి - వీరవల్లి ఏడు కొండలు, దారముక్కల వెంకటేశ్వర సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరందరిని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అభినందించారు. ఎన్నికల అధికారిగా తహసీల్దార్ రమాదేవి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో 18 సంఘాలు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండలంలో నాలుగు ఎర్రకాలువ సాగునీటి సంఘాలు, 14 మైనర్ సాగునీటి సంఘాలు ఏకగ్రీవమైనట్టు తహసీల్దార్ కె.స్లీవజోజి తెలిపారు. ఎర్రకాలువ సాగునీటి సంఘం (99)కి లక్కవరం గ్రామానికి చెందిన వందనపు నాగ వెంకటరమణ, ఎర్రకాలువ సాగునీటి సంఘం (100)కి నిమ్మలగూడెంకు చెందిన గ్రామానికి చెందిన వందనపు అంజనేయులు, ఎర్రకాలువ సాగునీటి సంఘం (101)కి చక్రదేవరపల్లికి చెందిన కంచర్ల నరసింహమూర్తి, ఎర్రకాలువ సాగునీటి సంఘం (102)కి పంగిడిగూడెం గ్రామానికి చెందిన మార్ని శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే పద్నాలుగు చెరువులకు సంబంధించిన సంఘాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'చలో విజయవాడ' విజయవంతం చేయాలి

లింగపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, స్వీపర్‌ల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని ఈనెల 16న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాడు బుచ్చిబాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు, స్వీపర్‌లకు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను విడుదల చేయడం లేదన్నారు. పదేళ్లుగా పనిచేస్తున్న వారికి కనీస గుర్తింపు లేదని వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నిర్మల, లక్ష్మి, రాజ్‌కుమార్, బేగం పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధికి చర్యలు

ఏలూరు రూరల్, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : విద్యారంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శనివారపపేట జడ్పీ హైస్కూల్ 40 వసంతాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రెండురోజుల పాటు జరిగే వేడుకల్లో పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకున్నారన్నారు. పాఠశాల హెచ్ఎం జి.ప్రకాశరావు, విశ్రాంత ఉపాధ్యాయులు జోగేశ్వరరావు, కో-ఆప్షన్‌సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు లంకపల్లి మాణిక్యాలరావు, రెడ్డినాగరాజు, మాజీ జడ్పీటీసీ మట్టా రాజేశ్వరి పాల్గొన్నారు.

126 మందికి వైద్య పరీక్షలు

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక అగ్రహారంలోని గీతాభవనం వద్ద శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయుష్ వైద్యాధికారులు బి.వి.ఎం.నగేష్, కె.ఎల్. సుభద్ర, ఎల్.శ్రీనివాస్, ఫార్మాసిస్టు ఎం. జమలు 126 మందికి ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ఉచితంగా మందులు అందించారు. వైద్యులు మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎవరైనా తాము సూచించినట్లు సక్రమంగా మందులు వాడుకుంటే సకాలంలో వ్యాధి తగ్గుతుందన్నారు. లయన్స్ నాయకులు మానేపల్లి రామారావు, బొలిశెట్టి సురేష్, చెన్నా వెంకట్రామయ్య పండరీనాథ్, శ్రీనివాస్ సేవలు అందించారు.



విర్డ్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు జరిపిన వైద్యబృందం

'విర్డ్' ఆర్థోపెడిక్ క్యాంప్‌లో 25 మందికి ఆపరేషన్లు

ద్వారకాతిరుమల, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): విర్డ్ ఆసుపత్రిలో శనివారంతో ముగిసిన నాలుగు రోజుల ఆర్థోపెడిక్ క్యాంప్‌లో యుఎస్‌ఏ నివాసి డాక్టర్ శ్రీనాథ్ కామినేని భుజం, మోచేయి రోగులు 65 మందిని పరీక్షించి వారికి వైద్యసేవలు అందించారు. ఈనెల 11 నుంచి ప్రారంభమైన వైద్య శిబిరంలో 25 మందికి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్టు ఆసుపత్రి ఛైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు తెలిపారు. అనంతరం దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి ట్రస్టీలు ఐవీఆర్ సుధాకరరావు, వి.నారాయణ మూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజి, విహారి, కె. శ్రీనివాస్, పీవీ నాగేంద్రబాబు, ఎల్లోరా పార్వతి, సింధు, గాయత్రి, అనిరుధ్ పాల్గొన్నారు.

'ఆయుష్'లో అరుదైన శస్త్రచికిత్స



శస్త్రచికిత్స అనంతరం బాలికతో ఆయుష్ వైద్యులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : అరుదుగా ఏర్పడే పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పదకొండేళ్ల బాలికకు ఏలూరు ఆయుష్ హాస్పిటల్ వైద్యనిపుణులు శస్త్ర చికిత్స చేసి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడారు. ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి శనివారం విలేకరులకు తెలిపారు. కర్నాటకకు చెందిన బాలిక తీవ్రమైన కడుపునొప్పి, వాంతులు, ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతుండగా ఆయుష్ హాస్పిటల్‌కు తల్లిదండ్రులు తీసుకువచ్చారు. రోగనిర్ధారణ పరీక్షల్లో బాలికకు అరుదైన పేగు అడ్డంకి, ఇస్కీమియా సోకినట్లు గుర్తించారు. పదివేల మందిలో ఒకరికి ఈ రుగ్మత ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆస్పత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ వేమూరి ప్రసన్నకుమార్ నేతృత్వంలోని వైద్యుల బృందం బాలికకు లాప్రోస్కోపి-సహాయక లాపరోటమీ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆపరేషన్ అనంతరం బాలిక ఆరోగ్యం మెరుగుపడిందనానరు. వైద్యబృందానికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి అనస్థీషియాలజిస్టు డాక్టర్ శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించండి : ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలతోనే పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అంగన్వాడీ సిబ్బందిని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆదేశించారు. మండలంలోని కొమ్మర అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజన సమయంలో పిల్లలతో పాటు కూర్చుని వంట ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. వండిన పదార్థాలను ఆయన రుచి చూశారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్న పౌష్టికాహారం పిల్లలకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూటమి నేతలు పలువురు పాల్గొన్నారు.



కొమ్మర అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్నన ఎమ్మెల్యే మద్దిపాటి



భువ్వనపల్లిలో సంకు నాగ శేషను జనసేనలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

జనసేనలో 500 మంది వైసీపీ నాయకులు చేరిక

నిడమర్రు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆశయాలు, విధానాలకు ఆకర్షితులై యువత సంకు నాగశేషు ఆధ్వర్యంలో పెద్దఎత్తున జనసేన పార్టీలో చేరడం ఆనందంగా ఉందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం భువ్వనపల్లిలో గణపవరం, నిడమర్రు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు సుమారు 500 మంది జనసేన పార్టీలో చేరిక కార్యక్రమం నిర్వహించారు. సంకు నాగశేషు ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ సర్కిల్ గణపవరం, నిడమర్రు మండలాల్లో 13 గ్రామాలకు చెందిన గ్రామ సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు భారీ ర్యాలీగా గణపవరం మండలం మొయ్యేరు నుంచి 50 కార్లు, బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భువ్వనపల్లిలో సంకు శేషు కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో తొలుత నాగశేషుకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పార్టీ కండువా కప్పి జనసేన లోకి ఆహ్వానించారు. అనంతరం పలు గ్రామాల నుంచి వచ్చిన వారికి పార్టీ కండువాలు కప్పారు. కార్యక్రమంలో ఎస్.కొండేపాడు గ్రామ సర్పంచ్ సీతాళం వీరలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు కోరుపోలు అప్పారావు, వేగిరెడ్డి దొరబాబు, పేరిచర్ల పెద్దిరాజు, కృష్ణమూర్తి, సంకు తాతాజీ, సంకు కొండరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నూతన వస్త్రాలు అందించిన రెవ. ఫాదర్ అమ్మన్‌రాజా

250 మంది విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేత

దెందులూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ సందర్భంగా 250 మంది పేద విద్యార్థులకు రూ.5 లక్షల విలువైన నూతన దుస్తులను ఫాదర్ అమ్మన్‌రాజా ఆధ్వర్యంలో అందజేశారు. ప్రతి ఏడాది మాదిరిగా శనివారం దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక సేవ దేవుని యందు భయ భక్తులు కలిగి నీతి నిజాయితీలతో జీవనం సాగించి ఉన్నత స్థానాల్లోకి వెళ్లాలన్నారు. గత వందేళ్లుగా దెందులూరు గ్రామంలో ప్రసిద్ధిగాంచిన ఆర్‌సీఎం విచారణ పీఠం ఆధ్వర్యంలో 500 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, బియ్యం, విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, నూతన వస్త్రాలను ప్రతి సంవత్సరం అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. కార్యక్రమంలో సహాయక గురువులు బాలరాజు, కల్యాణ్, ఉన్నారు

ఘనంగా దత్తాత్రేయ జయంతి

భీమడోలు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గుండుగొలనులో విఘ్నేశ్వర సేవా సమితి భవనంలో శనివారం దత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 60 మంది దివ్యాంగులకు దాట్ల రామకృష్ణంరాజు ఆర్థిక సాయంతో బియ్యం, పండ్లు, అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు దాతలను సత్కరించారు. పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీను, సోములు, గంగరాజు, నంబూరి సుబ్బరాజు, ఇందుకూరి రామరాజు, నంబూరి హరిరాజు, నడింపల్లి శ్రీనివాసరాజు, పాకలపాటి రామరాజు పాల్గొన్నారు.



మందులు అందిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

లాభాపేక్ష లేకుండా వైద్యసేవలు అందించాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): వైద్యులు భగవంతుడితో సమానమని లాభాపేక్ష లేకుండా వైద్యసేవలు అందించాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఆర్.ఆర్‌పేటలోని శ్రీకృష్ణ ఆర్థోపెడిక్ ఆసు పత్రిలో ప్రతినెల రెండో శనివారం ఉచిత సేవలు ప్రారంభించి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో శనివారం వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండేళ్ళుగా ఉచిత వైద్యసేవలు అందించటం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా ఆయన చేతులమీదుగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీకృష్ణ మాట్లాడుతూ పేదలకష్టాలు చూసి చలించానని, అందుకోసం ఉచిత వైద్యసేవలు నెలలో ఒకరోజు రెండో శనివారం అందిస్తున్నామన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

సీఎం సహాయనిధి నిరుపేదలకు అత్యవసర సమయాల్లో ఆసరాగా నిలుస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. క్యాంప్ కార్యాలయంలో శనివారం 9 మందికి 12 లక్షల 62 వేల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పేదలకు అందించారు. కేవీ తులసిరత్నం, పెద్దిబోయిన రామకృష్ణ, టి.వెంకటేశ్వరరావు, ఎమ్డీ హుస్సేన్ తదితరులకు చెక్కులు అందజేశారు. కో-ఆప్షన్ సభ్యుడు చోడే వెంకటరత్నం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి ఊరేగింపు

ఉంగుటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కైకరం షష్టి ఉత్సవాలలో భాగంగా శనివారం స్వామిని రథంపై పుర వీధులలో ఊరేగించారు. బాణసంచా, మేళ తాళాలతో తీన్‌మార్ డప్పులతో ఊరేగించగా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

నేడు మందుల పంపిణీ

ఉంగుటూరులో ఆదివారం పాతూరి కల్యాణ మండపంలో రూ.60లక్షలతో ఉచితంగా షుగర్ వ్యాధిగ్రస్తులైన 18 ఏళ్ల లోపు పిల్లలకు మందులు పంపిణీ చేస్తామని డాక్టర్ పాతూరి విష్ణురావు తెలిపారు.



పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో సమీక్షా సమావేశంలో కలెక్టర్, ఎస్పీ

ముఖ్యమంత్రి పోలవరం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

పోలవరం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టు పర్యటనలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, ఏఎస్పి ఎన్.సూర్య చంద్రరావు, ఏఆర్ డీఎస్పీ పి.చంద్రశేఖర్, పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను ఆమె పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం ఉదయం 10.45 గంటలకు ముఖ్యమంత్రి హెలీకాప్టర్‌పై పోలవరం ప్రాజెక్టుకి చేరుకుంటారని తొలుత డయాఫ్రంవాల్, కాఫర్‌డ్యాం, ప్రాజెక్టు ప్రాంతాలను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు రానీయకుండా జాగ్రత్తలు వహించాలని అధికారులకు సూచించారు. హెలీప్యాడ్ వద్ద కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రాజెక్టులో డయాఫ్రంవాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు గ్యాప్ 1,2,3 ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎంవీ రమణ, పోలవరం సీఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ పవన్ కుమార్, తహసీల్దారు బి.సాయిరాజు తదితరులు పాల్గొన్నారు.



సింగరాయపాలెంలో కైకలూరు మెజిస్ట్రేట్ దంపతుల పూజలు.. ఆలయంలో భక్తులు కిటకిట

సింగరాయపాలెంలో షష్టి ఉత్సవాల సందడి

ముదినేపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం షష్టి కల్యాణ మహోత్సవాల సందర్భంగా శనివారం భక్తులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దేవస్థానం ఆవరణ కోలాహలంగా కనిపించింది. సుమారు 20 వేల మంది భక్తులు పుట్టలో పాలుపోసి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు జరిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల పొంగళ్లతో మొక్కులను తీర్చుకున్నారు. కైకలూరు మెజిస్ట్రేట్ ఎం.శివకిరణ్ దంపతులు, సీఆర్‌డీఏ కార్యాలయ అడిషనల్ డైరెక్టర్ జోషి దంపతులు పుట్టలో పాలుపోసి పూజలు జరిపారు. వారికి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు రవికుమార్, సోవమ్మ, సుబ్బలక్ష్మి, దగాని నాగలక్ష్మి, సర్పంచ్ పరా విశ్వేశ్వరరావులకు స్వాగతం పలికి సత్కరించారు.

కేసుల సత్వర పరిష్కారానికి రాజీయే మార్గం

కైకలూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేసుల్లో ఇరుక్కున్న ఇరువర్గాల వారు సత్వర పరిష్కారానికి రాజీమార్గమే శ్రేయస్సు అని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి సూచించారు. శనివారం కైకలూరు న్యాయస్థానాల సముదాయంలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్‌లో 688 కేసులను రాజీ చేసి రూ.1,43,81,430 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కేసులు పరిష్కారంగా కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని దీన్ని సద్వినియోగం చేసుకున్న కక్షిదారులు అందరికి శుభాకాంక్షలు తెలిపారు. రాజీ పడితే ఇరు వర్గాలు గెలిచినట్టేనన్నారు. జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్, న్యాయవాదులు వడ్లాని శ్రీరామ చంద్రమూర్తి, పి.పవన్‌కాంత్, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

23 మంది జూదరుల అరెస్ట్

» రూ.రూ.68,300 నగదు స్వాధీనం

కలిదిండి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళ్లపాలెం, తాడినాడ గ్రామాల్లో పేకాటాడుతున్న శిబిరంపై దాడి చేసి 23 మందిని అరెస్ట్ చేశామని కలిదిండి ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ ఆదేశానుసారం కైకలూరు రూరల్ సీఐకు అందిన పేకాటాడుతున్న సమాచారంతో సిబ్బందితో ఆయా గ్రామాల్లో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి మొత్తం రూ.68,300 నగదు సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు.

మైనర్ బాలికకు యువకుడి వేధింపులు

» హెచ్చరించిన తండ్రి » కక్షగట్టిన యువకుడు

» బాలిక తండ్రితో గొడవపడి కత్తితో పొడిచి హత్య



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు

ఏలూరు క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లి మరణించడంతో తన ముగ్గురు ఆడపిల్లలను అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నాడు. ఉన్నకాడికి తాపీపనులు చేస్తూ తన పిల్లలను పోషించుకుంటున్నాడు. పేదరికంలో ఉన్నప్పటికీ తన పిల్లలను పెద్దవారిని చేసి మంచి సంబంధాలు చేయాలనే ఆలోచనలో ఉన్నాడు. అయితే ఆ ముగ్గురు పిల్లలు కూడా 12 సంవత్సరాలలోపు వారే. అంతలోనే ఒక ఆకతాయి పెద్ద కుమార్తె వెంట పడ్డాడు. ఇది మంచి పద్ధతి కాదని ఆ తండ్రి మందలించాడు. అయినప్పటికి కూడా తన వేధింపులు ఎక్కువ కావడంతో తన కుమార్తెను రక్షించుకోవాలని ఆ తండ్రి ముగ్గురు పిల్లలను తీసుకుని మరో ఊరు వెళ్ళి జీవిస్తున్నాడు. పనిమీద ఏలూరు వచ్చిన అతనిని కక్ష పెంచుకుని ఉన్న ఆ ఆకతాయి ఏకంగా ఆతండ్రిని కత్తితో పొడిచి హతమార్చాడు. ఈ సంఘటన ఏలూరు నగరంలో శనివారం తెల్లవారు జామున జరిగింది. ఏలూరు త్రి టౌన్ సీఐ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం. ఏలూరు ఓవర్ బ్రిడ్జి కింద 39వ పిల్లర్ వద్ద నివాసం ఉంటున్న షేక్ వెంకట కనకరాజు (45)కు భార్య నాగమణి ఎనిమిది సంవత్సరాల క్రితం మరణించింది. అతనికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కనకరాజు ఆటో నడిపేవాడు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురానికి చెందిన నాని అనే యువకుడు తరచుగా ఓవర్ బ్రిడ్జి కిందకు వచ్చి కనకరాజు పెద్ద కుమార్తె (12)ను వేధించేవాడు. తనకు ఇచ్చి పెళ్ళి చేయాలని లేదంటే ఎవరినో ఒకరిని చంపివేస్తానని బెదిరించేవాడు. ఈ నేపథ్యంలో కనకరాజుకు, నానికి గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో తమ పిల్లలను కాపాడుకోవడానికి ఆ ముగ్గురు పిల్లలను తీసుకుని ఉంగుటూరు మండలం నారాయణపురం వెళ్ళి అక్కడే ఉంటూ తాపీ పనులకు వెళ్తున్నాడు. ఈనెల 13వ తేదీ ఉదయం 39వ పిల్లర్ వద్ద అతను నివాసం ఉన్న నాగిరెడ్డి గంగలక్ష్మి ఇంటి వద్దకు వచ్చి ఉన్నాడు. తిరిగి సాయంత్రం వరకూ అక్కడే పడుకుని రాత్రి కూడా ఆ ఇంటి బయటే పడుకుని ఉన్నాడు. కనకరాజు వచ్చిన సంగతి నాని తెలుసుకుని శుక్రవారం రాత్రి ఆ ప్రాంతంలోనే సంచరించి కనకరాజు ఎక్కడ ఉన్నాడంటూ కొంతమందిని అడిగినట్లు చెబుతున్నారు. శనివారం తెల్లవారుజామున కనక రాజుతో నాని గొడవ పెట్టుకుని అతని కుమార్తెను ఇచ్చి పెళ్ళిచేయాలని బెదిరింపులకు పాల్పడి చివరకు కత్తితో పొడిచి హతమార్చి పరారీ అయ్యాడు. శనివారం ఉదయం ఈ సంఘటనపై ఆ ప్రాంత గ్రామ, వార్డు సంక్షేమ కార్యదర్శి (మహిళ పోలీస్) సిరిమళ్ళ నాగ దుర్గాభవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రి టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. మరోవైపు నాని కోసం ప్రత్యేక బృందాలను గాలింపుల్లోకి దించారు. ఆదివారం శవపంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిర్వహించ నున్నారు. కనకరాజు బంధువులకు సమాచారం ఇచ్చారు.

పల్లవపాలెంలుగా పేర్లు మార్పు చేయాలి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం సమర్పిస్తున్న అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్

కలిదిండి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పల్లిపాలెంలుగా ఉన్న ఊరు పేర్లను పల్లవపాలెంలుగా మార్పు చేయాలని కోరుతూ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్ శనివారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. అగ్నికుల క్షత్రియులు నివసిస్తున్న గ్రామాలను పల్లిపాలెంలుగా పేర్లు పెట్టడంతో అగ్నికుల క్షత్రియుల మనోభావాలు దెబ్బతింటున్నాయని వివరించారు. టీడీపీ నాయకులు టి.ఈశ్వర పరశురాముడు, ఎం.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



అప్పు...తప్పు!

సండే స్పెషల్

» అప్పుల ఊబిలో సామాన్యులు
» వసూళ్లు లేవంటున్న మాన్యులు
» పలువురు అవసరాల కోసం.. మరికొందరు అప్పుచేసి ఆర్భాటాలు

● భీమవరానికి చెందిన కృష్ణప్ప తన అవసరాల నిమిత్తం రూ.20 లక్షలు అప్పు తెచ్చాడు. అప్పు తీర్చాలనే సంకల్పం ఉన్నా చేస్తున్న వ్యాపారాలు కలిసి రాక సకాలంలో వడ్డీలు కట్టలేని పరిస్థితి. చావా రేవా అనే పరిస్థితుల్లో అప్పు తీసుకునే వ్యక్తి ఉండగా అప్పు ఇస్తున్న ఆసామీలు తమ బాకీ వసూళ్లకు ఇబ్బందులు పడుతున్నారు.

● పాలకొల్లుకు చెందిన కృష్ణారావు (పేరు మార్చబడింది) తన కుమార్తె వివాహం నిమిత్తం రూ.25 వేలు రుణం తీసుకున్నాడు. ఆపై రుణం ఇచ్చిన వ్యక్తి ఎన్ని పర్యాయలు అడిగినా తీర్చలేకపోయాడు. వారం కిందట రుణం ఇచ్చిన వ్యక్తి కృష్ణారావు ఇంటికి వెళ్లి గట్టిగా నిలదీయగా 'నా చావుకు నీవే కారణమని లెటర్ రాసి ఆత్మహత్య చేసుకుంటా' అంటూ బెదిరించడంతో రుణం ఇచ్చిన ఏం చేయాలో తెలియక వెనుదిరిగాడు.

పాలకొల్లు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అప్పు.. అనే పదం ఇప్పుడు అందరి నోటా విన్పించే వాడుక పదంగా మారింది.. అప్పు ఇవ్వడం తప్పా.. తీసుకోవడం తప్పా అంటే.. ఆర్థిక నిపుణులు రెండు తప్పే అంటున్నారు. ప్రస్తుత రోజుల్లో అప్పులు తీసుకునేవారి సంఖ్యతోపాటు ఇచ్చేవారి సంఖ్య పెరిగింది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాల్లో అప్పులు లేనిదే గడవడం లేదు. ఉమ్మడి జిల్లాలో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోతుండగా మరోవైపు అప్పులు ఇచ్చిన మాన్యులు వసూలు కాక ఇబ్బందులు పడుతున్న పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

నేటి రోజుల్లో ప్రతీ చిన్న అవసరానికి అప్పు లేనిదే రోజు గడవని పరిస్థితి ఏర్పడింది. నిత్యావసరాలు మొదలుకొని గృహోపకరణాలు, ఆభరణాలు సైతం ఈఎంఐల పద్ధతి లో లభిస్తుండం, ఇవి కాకుండా ప్రైవేటు వ్యక్తులు అప్పులు ఇస్తుండడం తీసుకునేవారికి ఒక రకంగా శాపంగానే మారింది. ముఖ్యంగా పిల్లల ఉన్నత విద్యకు, అవసరాలు, నిర్మాణాలు వంటి వాటికి అరకొర మేరకు అప్పు చేస్తే పర్వాలేదు. అయితే నేడు అనేక కుటుంబాల్లో ఆర్భాటాలకు పోతూ అప్పులు చేస్తున్నారు. అప్పు తీర్చే విధానం ఏ విధంగా ఉంది.. ఆదాయం ఎంత వస్తుంది.. ఇంటి అవసరాలకు పోను అప్పు తీర్చడానికి సొమ్ములు మిగులుతాయా.. అనే అంశాలను పరిగణలోకి తీసుకోకుండానే అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నారు. పేదరికంలో అవసరానికి అప్పు చేసే వ్యక్తులు ఒక కోవకు చెందిన వారు అయితే ఆర్భాటాలకు అవసరం లేని ఖర్చులకు అప్పులు చేసే వారు మరో కోవకు చెందినవారు. ఇప్పుడు జిల్లాలో 50 శాతం పైబడి పౌరులు వివిధ రూపాల్లో రుణగ్రహీతలుగానే ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

అప్పు కోసం తిప్పలు

ఏదైనా అవసరం పడి మిత్రులను బంధువులను అప్పు అడిగితే ఒకటి లేదా రెండు సార్లు అడిగిన వెంటనే అప్పులు తీసుకునే పరిస్థితి ఉంది. అయితే అప్పు తీసుకున్న ఆసామీలు తగిన సమయానికి ఇవ్వకపోవడంతో అప్పు తీర్చమని వందల సార్లు వేడుకోవాల్సి వస్తుందని అప్పు ఇస్తున్న వ్యక్తులు వాపోతున్నారు. అప్పు తీసుకున్నవారు పెద్ద సంఖ్యలో ఉండగా అప్పు ఇస్తున్న వారూ అధికంగానే ఉన్నారు. ఒక అంచనా ప్రకారం జిల్లాలో రూ. 10 వేల కోట్ల రూపాయల పైబడి ప్రైవేటు రుణాలు వివిధ రూపాల్లో సామాన్య, మధ్యతరగతి ప్రజల వద్ద ఉన్నాయి. ఇవన్నీ ఒప్పందం ప్రకారం తీరుతాయా అంటే అనుమానమే. ఎందుకంటే ప్రస్తుతం తీవ్ర ఆర్థికమాద్యం తాండవిస్తోంది. విపణిలో వ్యాపారాలు లేవు. సామాన్యుల చేతిలో నగదు లేదు. ఈ పరిస్థితుల్లో అప్పు పుట్టలన్నా లేదా ఇచ్చిన అప్పు వసూలు కావాలన్నా తిప్పలు తప్పడం లేదు.

ఆస్తి రాసి ఇస్తేనే..

ప్రామిసరీనోటు చేతి అప్పులు మాట అలా ఉంచితే మార్కెట్‌లో కొత్త తరహా అప్పు విధానం నడుస్తోంది. ఒక వ్యక్తికి రూ.పది లక్షలు అప్పు కావాలంటే అతడికి ఉన్న ఇంటినో స్థలాన్నో లేదా పొలాన్నో అప్పు ఇచ్చేవ్యక్తి కొనుగోలు చేసుకున్నట్టు రాయించుకుని అప్పు ఇస్తున్నారు. అప్పు తీసుకున్న వ్యక్తులు సకాలంలో చెల్లించలేకపోతే ఆస్తి మొత్తం అప్పు ఇచ్చిన వ్యక్తి స్వాధీనం చేసుకునే పరిస్థితి. అయితే అప్పు తీవ్వ తీసుకున్న వ్యక్తి అప్పు తీరుస్తామని వెళ్లినా ఆస్తి రాయించుకుని అప్పు ఇచ్చిన వ్యక్తులు అడ్డం తిరుగుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి.

ఆర్భాటాలకు అప్పులు వద్దు..

అప్పులు కోసం అర్రులు చాయడం, ఏమంత క్షేమకరం కాదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఆయా కుటుంబాలు తమ ఆదాయాన్ని ఖర్చులను మదింపు చేసుకుని అవసరం మేరకే ఖర్చులు చేయాలని సూచిస్తున్నారు. ఆర్భాటాల కోసం అప్పులు చేస్తే చివరకు ప్రాణాంతకంగా మారుతుందని అప్పు తీర్చాలనే సదుద్దేశ్యం ఉన్నప్పటికి చేతిలో చిల్లి గవ్వ లేని పరిస్థితుల్లో ఆయా వ్యక్తులు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య వైపు వెలుతున్నారని మానసిక వైద్యులు చెబుతున్నారు. పక్కవాళ్లను చూసి స్తోమత్త లేకున్నా అప్పులు చేసి పిల్లలకు కార్పొరేట్ విద్య, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం, ఇళ్లు, ఇళ్ల స్థలాల కొనుగోలు, పెండ్లి వేడుకలు వంటి వాటి వల్ల అప్పు తిప్పలే మిగులుతాయని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. తమ చేతిలో 85 శాతం పైబడి పెట్టుబడి పెట్టగలిగినప్పుడే సొంతింటికి కొనుగోలుకు వెళ్ళాలని అప్పులు చేసి ఇల్లు కొనుగోలు చేస్తే చివరకు అమ్ముకునే పరిస్థితి వస్తుందని సూచిస్తున్నారు. మరోవైపు అప్పు ఇచ్చేవాళ్లు కూడా తమకు అప్పు తిప్పలు తప్పాలంటే అప్పు తీసుకుంటున్న వ్యక్తి గురించి పూర్తిగా తెలుసుకోవాలని, అప్పు తీర్చగలిగే శక్తి ఉందా లేదని గమనించాలని ఆర్థిక రంగనిపుణులు సూచిస్తున్నారు.



ముసునూరు నల్లచెరువుకు అధ్యక్షుడిగా ధృవీకరణ పత్రాన్ని అందుకుంటున్న నాగరాజు.. కలిదిండి నీటి సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన పి.సత్యనారాయణను అభినందిస్తున్న కూటమి నాయకులు, తుక్కులూరులో ఎన్నికైన సభ్యులు.. సీకే పాడు నీటి సంఘం అధ్యక్షుడుగా ఎన్నికైన మంచిన పూర్ణచంద్రరావుకు ధృవపత్రం అందజేస్తున్న అధికారి

సాగునీటి సంఘాలు కూటమికి ఏకగ్రీవం

చాట్రాయి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో 16 సాగునీటి సంఘాలు ఏకగ్రీవం అయ్యాయి. సాటినీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నికైన వారు యర్రా రమేష్ (తమ్మిలేరు పోలవరం), మంచిన పూర్ణచంద్రరావు (సీకే పాడు ఛానల్), తుమ్మల చిన్న సాంబశివరావు (పెద్దచెరువు చాట్రాయి), ఓరుగంటి రామారావు (దీపచెరువు చాట్రాయి), బాల లక్ష్మి(కొత్తచెరువు తుమ్మగూడెం), కోవిలంపాటి రామారావు(బొత్తలచెరువు జనార్ధనవరం), వెలివల ఏడుకొండలు (పెద్దచెరువు సోమవరం), వెల్ది అప్పారావు(తమ్మిలేరు చాట్రాయి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంకా వివిధ సంఘాలకు చిన్నం కృష్ణ, బొట్టు రమేష్, కందుల రమేష్, నాగ సత్యనారాయణరెడ్డి, భక్తవత్సలరెడ్డి, బేతిన వీరరాఘవయ్య, దామెర సింధూర్, సాదం వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ముసునూరు: మండలంలో ఒక ఎన్ఎస్పీ మేజర్, 16 మైనర్ ఇరిగేషన్ చెరువులకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల నీటి సంఘం ఎన్నికలు శనివారం వివాదాలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగాయి. కూటమి పార్టీల వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కలిదిండి: మండలంలో మొత్తం 12 నీటి సంఘాల ఎన్నికల ఏకగ్రీవమయ్యాయి. తాడినాడ నీటి సంఘం అధ్యక్షుడిగా నంబూరి లచ్చిరాజు, ఉపాధ్యక్షుడిగా సోర్రా రాజేంద్ర ప్రసాద్, వేమవరప్పాడు నీటి సంఘం అధ్యక్షుడిగా బోడావుల వసంతరావు, ఉపాధ్యక్షుడిగా చెన్నంశెట్టి శ్రీనివాసరావు, సానారుద్రవరం నీటి సంఘం అధ్యక్షుడిగా నున్న కృష్ణబాబు, మారగాని రామచంద్రరావు, పోతుమర్రు నీటి సంఘం అధ్యక్షుడిగా పడమటి రాముడు, ఉపాధ్యక్షుడు గొర్ల వెంకట సత్యనారాయణ, కోరుకొల్లు నీటి సంఘం అధ్యక్షుడిగా కేశిరెడ్డి బలరామ్, ఉపాధ్యక్షుడిగా తోట శ్రీరామ చంద్రమూర్తి, పడమటి పాలెం నీటి సంఘం అధ్యక్షుడిగా కనగాల మోహనరావు, ఉపాధ్యక్షుడిగా పెరవల శ్రీహరి, కలిదిండి నీటి సంఘం అధ్యక్షుడిగా పేటేటి వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బత్తిన ఆంజనేయ రాజు, కొండంగి నీటి సంఘం అధ్యక్షుడిగా ఇమ్మానేని చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా బత్తిన పూర్ణచంద్రరావు, మట్టగుంట నీటి సంఘం అధ్యక్షుడిగా నాగిడి వీరబ్రహ్మం, ఉపాధ్యక్షుడిగా దున్న వెంకటేశ్వర్లు, భాస్కరావుపేట నీటి సంఘం అధ్యక్షుడిగా మంతెన సుబ్బరాజు, ఉపాధ్యక్షుడిగా పోత్రు విజయ కుమార్, మూల్లంక నీటి సంఘం అధ్యక్షుడిగా పెన్మెత్స సూర్యనారాయణ రాజు, ఉపాధ్యక్షుడిగా కేత రామచంద్రరావు, పెదలంక నీటి సంఘం అధ్యక్షుడిగా ముద్దం భోగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా నడకుదిటి ప్రసాదరావు ఎన్నికయ్యారు.

కైకలూరు: కైకలూరు మండలంలో ఐదు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. కైకలూరు, గోపవరం, పల్లెవాడ, తామరకొల్లు, దొడ్డి సాగునీటి సంఘాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కైకలూరు నీటి సంఘ అధ్యక్షుడిగా కన్నా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా మరిపి శ్రీనివాసరావు, పల్లెవాడ నీటి సంఘ అధ్యక్షుడిగా పొట్టూరి సురేష్‌రాజు, ఉపాధ్యక్షుడిగా పేటేటి బుసయ్య, గోపవరం నీటి సంఘ అధ్యక్షుడిగా కట్టా రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా అట్టూరి చంద్రశేఖర్, తామరకొల్లు నీటి సంఘ అధ్యక్షుడిగా గంగుల ఏసురాజు, ఉపాధ్యక్షుడిగా యలవర్తి సతీష్, దొడ్డిపట్ల నీటి సంఘ అధ్యక్షుడిగా ఏటుకూరి వెంకట సత్య పెద్దిరాజు, ఉపాధ్యక్షుడిగా ఎర్రంశెట్టి వేణు ఎన్నికయ్యారు. వీరందరికీ ఆయా ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందించారు. గోపవరంలో మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాద్‌రాజు, మాజీ సర్పంచ్ అలూరి రాజేష్ పాల్గొని గెలుపొందిన వారిని ఘనంగా సత్కరించారు.

మండవల్లి : మండవల్లి మండలంలోని నీటి సంఘాల ఎన్నికల్లో తొమ్మిది సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మొత్తం 110 టీసీలకుగాను కృష్ణాజిల్లాకు చెందిన రెండు టీసీలలో సభ్యులు లేకపోవడంతో ఖాళీగా మారాయి. మిగిలిన 108 టీసీలలో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గన్నవరం నీటి సంఘానికి అధ్యక్షుడిగా కూనపరెడ్డి బాలకోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పల్లపోతు సహదేవుడు, కానుకొల్లు అధ్యక్షుడు కందేటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా పులకుర్తి గోవిందరాజులు, లింగాల అధ్యక్షుడిగా నారగాని ఎనాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బోయిడి భగత్‌సింగ్, భైరవపట్నం అధ్యక్షుడి బొల్లెంపల్లి కృష్ణారావు, ఉపాధ్యక్షుడు తలారి పోతురాజు, పులపర్రు అధ్యక్షుడు కాట్రగడ్డ శంకరరావు, ఉపాధ్యక్షుడు పూల ఆదినారాయణ, ఉనికిలి అధ్యక్షుడు చదలవాడ శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షుడు తమ్మినేని నరేంద్ర కుమార్, నుచ్చిమిల్లి అధ్యక్షుడు అగస్తి మోహనరావు, ఉపాధ్యక్షుడు మోరు జగన్మోహనరావు, పెరికెగూడెం అధ్యక్షుడు ఎలికె రాంబాబు, ఉపాధ్యక్షుడు నీలపాల లక్ష్మణ, పుట్లచెరువు అధ్యక్షుడు గందేం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా పరిశెకిన్నిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ముదినేపల్లి : ముదినేపల్లి మండలంలోని 12 సాగునీటి వినియోగదారుల సంఘాలకు శనివారం ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. అన్ని సంఘాల ప్రాదేశిక నియోజకవర్గాలకు 134 మంది సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం కాగా, సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఏకగ్రీవ ఎన్నికలే జరిగాయి. గురజ సంఘం అధ్యక్షుడిగా హనుమార పేర్నీడు, ఉపాధ్యక్షుడిగా పరిమిశెట్టి శోభనాద్రిరావు, పెదగొన్నూరు సంఘ అధ్యక్షుడిగా గుడిసేవ సురేష్ బాబు, ఉపాధ్యక్షుడిగా కట్టా కోటయ్య, కోమర్రు సంఘ అధ్యక్షుడిగా పోతురాజు రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా రెడ్డి మధు, వణుదుర్రు సంఘ అధ్యక్షుడిగా పోసిన పాండురంగారావు, ఉపాధ్యక్షుడిగా మైనేని సీతారామయ్య వాడవల్లి సంఘ అధ్యక్షుడిగా సుధాబత్తుల సుధాకర్, ఉపాధ్యక్షుడిగా కోలా సత్యనారాయణ, బొమ్మినంపాడు నీటి సంఘం అధ్యక్షుడిగా కేనం ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా నాయుడు నాగరాజు, పెదపాలపర్రు సంఘ అధ్యక్షుడిగా చల్లగుళ్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా గొడవర్తి రవి, దాకరం సంఘ అధ్యక్షుడిగా తలారి రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా మురాల వీర రాఘవులు, కోడూరు సంఘ అధ్యక్షుడిగా తాతినేని లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా సూరపనేని నగేష్, ప్రొద్దువాక సంఘ అధ్యక్షుడిగా సీర సీతారామయ్య, ఉపాధ్యక్షుడిగా, చేవూరు సంఘ అధ్యక్షుడిగా శాయిన ప్రసాదరావు, ఉపాధ్యక్షుడిగా బొమ్మిశెట్టి వెంకన్న, వైవాక సంఘ అధ్యక్షుడిగా పోతుమూడి సోమేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కరేటి రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నూజివీడు టౌన్: నూజివీడు మండలంలో నీటి సంఘాలు అన్ని దాదాపు ఏకగ్రీవం అయ్యాయి. కాలువలకు సంబంధించిన నీటిసంఘాల్లో పల్లెర్లమూడి పరిధిలోని నీటిసంఘం అధ్యక్ష ఎన్నికలో మాత్రం కొంత ప్రతిష్టంభన ఏర్పడింది. కృష్ణాజిల్లా పరిధిలోని కొయ్యూరు గ్రామానికి సంబంధించి ముగ్గురు సభ్యులు ఎన్నిక కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో సంబంధిత విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టిలో ఉంచినట్లు అధికారులు తెలిపారు. కాగా నూజివీడు పెద్ద చెరువు నీటిసంఘం అధ్యక్షునిగా దాసరి సత్యనారాయణ, తుక్కులూరు ముద్దుల చెరువు నీటి సంఘం అధ్యక్షునిగా గుండుబోయిన వెంకట లక్ష్మణరావు, పల్లెర్లమూడి దేవమ్మచెరువు అధ్యక్షురాలిగా కోనేరు లక్ష్మిప్రసూనాంబ, పల్లెర్లమూడి పెద్దచెరువు అధ్యక్షునిగా మూడి మల్లేశ్వరరావులు ఎన్నిక అయ్యారు. ఈ మేరకు కూటమి నాయకులు సభ్యులను అభినందించారు.,



చిత్తపూరులో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహనా ర్యాలీ

సారా, గంజాయి అనర్థాలపై అవగాహన ర్యాలీ

చాట్రాయి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సారా గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించటం వలన నాడీ వ్యవస్థ దెబ్బతిని ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తుందని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య అన్నారు. మండలంలోని చిత్తపూరులో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆరుగొలను పేట ఫారెస్టులోని సారా స్థావరంపై దాడి చేసి 600 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం చేసి, 10 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నామని, నేర స్థలం నుంచి పారిపోయిన తాతకుంట్ల తండాకు చెందిన బాణావత్తు సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు ఈశ్వరరావు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తకు ఆర్థికసాయం

నూజివీడు టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో బాధపడుతున్న జనసేన వీరమహిళకు నూజివీడు జనసేన నాయకులు బర్మాఫణిబాబు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. నూజివీడు 2వ వార్డుకు చెందిన వీరమహిళ విజయశ్రీ అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో ఆమెను పరామర్శించి వైద్యచికిత్స నిమిత్తం ఆయన ఆర్థిక సహాయాన్ని అందించారు.

లోక్‌అదాలత్‌లో 387 కేసులు పరిష్కారం

నూజివీడు టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడంలో కోర్టు అమూల్యమైన సమయాన్ని కాపాడిన వారు అవుతారని 15వ అదనపు జిల్లా జడ్జి ఏ.నాగశైలజ అన్నారు. నూజివీడు కోర్టుహాలు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్‌ను పురస్కరించుకుని ఆమె కక్షిదారులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా 387 కేసులను పరిష్కరించి రూ.2,40,54,160లను బాధితులకు అందించేలా ఆదేశాలను జారీ చేశారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని కూటమి సర్కార్

చాట్రాయి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి సర్కార్ ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ప్రచార ఆర్భాటంతో కాలక్షేపం చేస్తున్నదని సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహ, కొమ్ము ఆనందం, చెంగల వెంకటేశ్వరరావు విమర్శించారు. మండలంలోని చిన్నంపేటలో శనివారం సీపీఐ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ 2047 అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని, ఎన్నికల హామీలకు విరుద్ధంగా విద్యుత్ చార్జీలు పెంచటం శోచనీయం అన్నారు.

మోటార్ సైక్లిస్టు దుర్మరణం

ముదినేపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చేవూరుపాలెం గ్రామం వద్ద శుక్రవారం జరిగిన బైక్ ప్రమాదంలో చిలకలపూడికి చెందిన దాసరి నాగమల్లేశ్వరరావు దుర్మరణం చెందారు. సింగరాయపాలెం గ్రోవెల్ కంపెనీకి డ్యూటీకి వస్తుండగా, ఆ గ్రామం వద్ద కుక్కను తప్పించబోగా బైక్ అదుపు తప్పి క్రింద పడిపోయిన నాగమల్లేశ్వరరావు తలకు బలమైన గాయమైంది. వెంటనే పోలీసులు గుడివాడ ఆసుపత్రికి తరలించినా ఫలితం లేక మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

చాట్రాయి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): విజయవాడ-సత్తుపల్లి రహదారిలో సూరంపాలెం వద్ద శనివారం ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం కలగరకు చెందిన మిద్దే వెంకటేశ్వరరావు, సూరంపాలెంకు చెందిన జక్కం రాజేష్ గాయపడ్డారు. మిద్దే వెంకటేశ్వరరావును 108లో నూజివీడు ఆసుపత్రికి, జక్కం రాజేష్‌ని ప్రైవేటు వాహనంలో విజయవాడ హాస్పటల్‌కి తరలించారు.